విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

ఆదివారం 28 సెప్టెంబరు 2025 8 పేజీలు

గొంతులోకి గరళం..!

- మంచినీరు కలుషితం అవుతున్నా పట్టించుకోని అధికారులు
- ప్రజలు వ్యాధుల బారిన పడినప్పుడే అధికారుల పరుగులు
- ప్రైవేటు ప్లాంట్లలో సైతం లభించని పరిశుభ్ర నీరు
- జిల్లాలో తాగునీటి పరిస్థితి అధ్వానం

విశాలాంధ్ర - కొవ్వూరు: మొన్న గుంటూరు జిల్లా తురకపాలెంలో కలుషిత నీరు తాగి డయేరియా... నిన్న విజయవాడ రాజరాజేశ్వరి పేటలో కలుషిత నీరుతో ఇబ్బందులు.. ఇన్ని జరుగుతున్నా శుద్ధినీరును అందించాల్సిన స్థానిక సంస్థలు, ప్రైవేటు ఆర్వో ▶మిగతా 2లో..

నేవీ ఆయుధ డిపో నిర్మాణం నిలిపివేయాలి

నేవీ ఆయుధ డిపో నిర్మాణానికి వ్యతిరేకంగా ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం

విశాలాంధ్ర-ఏలూరు: జీలుగుమిల్లి మండలం వంకవారిగూడెంలో నిర్మాణం చేపడుతున్న నేవీ ఆయుధ డిపోను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సీపీఐ ఎంఎల్ (న్యూడెమోక్రసీ) జిల్లా నాయకులు ఎస్.రామ్మోహన్ డిమాండ్ చేశారు. శనివారం నాడు స్థానిక అన్నే వెంకటేశ్వరరావు భవనంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నేవీ ఆయుధ డిపోకు వ్యతిరేకంగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్ష వర్గంగా ఏపీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తెల్లం దుర్గారావు, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, రైతు కూలీ సంఘం జిల్లా

నాయకులు ఇ.భూషణం వ్యవహరించారు. ఈ సందర్భంగా రవి, బండి వెంకటేశ్వరరావు, ఎస్.రామ్మోహన్ మాట్లాడుతూ జీలుగుమిల్లి మండలం వంకవారిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఐదు గ్రామాలు వంకవారి గూడెం, దాట్లవారిగూడెం, ▶మిగతా 2లో..

పొగాకు రైతులకు రూ.74 కోట్ల లబ్ధి

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: అదనపు పొగాకు కొనుగోళ్లకు కేంద్ర ప్రభుత్వం అనుమతించడం వలన ఏలూరు జిల్లాలో వర్జీనియా పొగాకు రైతులకు రూ.74 కోట్ల లబ్ధి చేకూరిందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ తెలిపారు. శనివారం జంగారెడ్డిగూడెంలోని పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఎంపీ మహేష్ కుమార్ కొనుగోళ్ల తీరును పరిశీలించారు. అనంతరం రైతులను,

మీడియాను ఉద్దేశించి మాట్లాడుతూ రైతులు పండించిన పొగాకును కొనుగోలు చేసేందుకు పొగాకు బోర్డు రకరకాల నిబంధనలు విధించడంతో రైతుల అగమ్య గోచర పరిస్థితిని అర్థం చేసుకొని ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రైతుల తరపున విజ్ఞప్తి చేశామన్నారు. ఎన్నడూ లేని స్థాయిలో పొగాకు వేలంలో కేజీకి రూ. 430 ధర పలకడంతో రైతుల ముఖంలో ఆనందం కనపడుతోందన్నారు. పొగాకు రైతుల కోరిక మేరకు జంగారెడ్డిగూడెం పొగాకు వేలం కేంద్రంలో మరొక ఎన్.ఎల్.ఎస్., ప్లాట్ ఫామ్ మంజూరుకు చర్యలు ▶మిగతా 2లో..

ధవళేశ్వరం బ్యారేజి వద్ద
మొదటి ప్రమాద హెచ్చరిక

విశాలాంధ్ర - కడియం : తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. శనివారం సాయం త్రం 5 గంటలకు గోదావరి నీటిమట్టం 11.75 అడుగు లకు చేరింది. బ్యారేజ్ నుండి 175 గేట్లు పైకెత్తి 10.01 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్ర జలాలకు విడుదల చేసినట్లు అధికారులు



తెలిపారు. బ్యారేజ్ వద్ద గోదావరి వరద మరింత పెరగనున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు వెల్లడించారు. మూడు ప్రధాన ▶మిగతా 2లో..

రిక్షాస్టాండ్ తొలగిస్తే ఊరుకోం

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి జయరాజు

విశాలాంధ్ర - మండపేట : పట్టణంలోని మెయిన్ రోడ్డు బస్టాండ్ చెంతన ఉన్న రిక్షా స్టాండ్‌ను తొలగించాలని చూస్తున్నారని, దమ్ముంటే ఆ స్టాండ్ టచ్ చేసి చూడండంటూ అధికారులు, పాలకులను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దూలి జయ రాజు హెచ్చరించారు. బస్టాండ్‌లోని రిక్షా స్టాండును తొలగించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్న క్రమంలో రిక్షా కార్మికులకు ఎమ్మార్పీఎస్, కార్మిక సంఘాలు, సీపీఐ నాయకులు అండగా నిలిచారు. ఈ నేపథ్యంలో శనివారం రిక్షా స్టాండులో రిక్షా కార్మికులతో కలిసి వారంతా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దూలి జయరాజు మాట్లాడుతూ మండపేటలో పెత్తందారుల పెత్తనం పెచ్చు మీరిపోతుందని మండి పడ్డారు. సుమారు 70 సంవత్సరాలుగా బస్టాండ్ వద్ద ఉన్న చెట్టు నీడన రిక్షా కార్మికులు జీవనోపాధి సాగిస్తున్నారన్నారు. రిక్షా తొక్కుకొని ఎంతోమంది తమ కుటుంబాలను పోషించుకునేవారన్నారు. ఏ పూట రిక్షా తొక్కితే ఆ పూట గడవని కార్మికుల పొట్ట గొట్టాలని కొంతమంది చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రిక్షా

కార్మికుల జోలికి వస్తే ఊరుకునేది లేదని మరోసారి హెచ్చరించారు. గత ప్రభుత్వంలో రిక్షా కార్మికులు ఎండకు ఎండి వానకు తడిసి చెట్టు పంచన తలదాచుకుంటున్నారని తెలిసిన మాజీ మంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్ రిక్షా స్టాండు ఏర్పాటు చేశారన్నారు. అప్పట్లో ఆ రేకు షెడ్డుకు మున్సిపల్ కౌన్సిల్లో తీర్మానం చేసి మరి రిక్షా స్టాండు ▶మిగతా 4లో..

29 నుంచి పారిశుధ్య కార్మికుల సమ్మె

విశాలాంధ్ర-తణుకు: ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల 4 నెలల వేతన బకాయిలు, 40నెలల పిఎఫ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని, తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి 150 పడకల స్థాయికనుగుణంగా కనీసం ఏభై మందికి తగ్గకుండా పారిశుధ్య కార్మికులను నియమించి కార్మికుల పనిభారం తగ్గించాలని కోరుతూ ఈనెల 29వ తేదీ నుంచి విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొంటున్నట్టు ఏపీ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు అన్నారు. ఎ.పి.మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయికిరణ్‌కి సమ్మె నోటీసు సమర్పించారు. ఈసందర్భంగా భీమారావు మాట్లాడుతూ ఆసుపత్రి పారిశుధ్య కార్మికులకు ఇస్తున్న అతి తక్కువ వేతనాలే నెల నెలా సక్రమంగా ఇవ్వక పోవడంతో పస్తులతో విధులు నిర్వహిస్తున్నారన్నారు. పిఎఫ్ సొమ్ము సైతం కార్మికుల పిఎఫ్ ఖాతాలకు జమ చేయడం లేదన్నారు. 150 పడకల స్థాయి కనుగుణంగా

పారిశుధ్య కార్మికులు లేక తీవ్ర పనిభారంతో కార్మికులు అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. తక్షణమే పారిశుధ్య కార్మికులకు నాలుగు నెలల వేతన బకాయిలు చెల్లించి వారి న్యాయమైన డిమాండ్స్ పరిష్కరించాలని భీమారావు డిమాండ్ చేశారు. మెడికల్ ఎంప్లాయిస్ అండ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ధర్మాని పుష్పలత, భారతి, సీహెచ్ మంగమ్మ, పి.విజయలక్ష్మి, మెండి శ్రీను, వెంకటలక్ష్మి, ప్రసన్న, ఎం.బేబి, ఇ.హైమావతి, డి. శ్రీనువాసు, చింతాలు, డి. దంమూరు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో అనుకున్న లక్ష్య సాధన

విద్యార్థులకు డీఎస్పీ సూచన

విశాలాంధ్ర-లింగపాలెం: విద్యార్థులు క్రమశిక్షణను అలవాటు చేసుకుంటే అనుకొన్న లక్ష్యాన్ని సాధిస్తారని డి.ఎస్.పి రవిచంద్ర అన్నారు. ధర్మాజీగూడెంలోని ప్రతిభ, సాయి జూనియర్ కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల

భవిష్యత్తుకు సంబంధించి పలు విషయాలు వివరించారు. క్రమశిక్షణ అలవాటు చేసుకోవడం వల్ల సమాజానికి ప్రతిభావంతులైన పౌరులుగా ఉంటారని అన్నారు. అఘాయిత్యాలు జరగకుండా అఘాయిత్యాల బారిన పడకుండా విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అన్యాయాలు జరిగినప్పుడు ధైర్యంగా ఎదుర్కోవాలని అన్నారు. చట్టాన్ని గౌరవించాలని కోరారు.సైబర్ నేరాలు నిరోధించటంలో విద్యార్థుల పాత్ర కీలకంగా ఉండాలని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రలోభాలకు గురి కావద్దని, ఓటిపిని మరొకరితో షేర్ చేసుకోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ క్రాంతి కుమార్,ఎస్సై వెంకన్న బాబు,కళాశాలల డైరెక్టర్ సుజాత కుమారి, కరస్పాండెంట్ కె. నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, కాలేజీ యాజమాన్యం డీఎస్పీని సత్కరించారు.

సబ్సిడీపై రైతులకు ఇచ్చే ఎరువులను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-ముదినేపల్లి: సబ్సిడీపై ప్రభుత్వం ఇచ్చే ఎరువులను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని పిఏసిఎస్ అధ్యక్షులు చలసాని జగన్మోహనరావు అన్నారు. ముదినేపల్లి మండలం చిగురుకోట పిఏసిఎస్‌లో రైతు

లకు జింక్ 12శాతంతో రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిష్ ఫీడ్ , రైతు నేస్తం, కర్షకమిత్ర వంటి రుణాలను ఇవ్వనున్నట్లు తెలిపారు. పిఏసిఎస్ ల ద్వారా రైతులు వ్యవసాయ ఆధారిత, ఆక్వా అవసరాలను పొందాలన్నారు. ఈ సర్వసభ్య సమావేశంలో సొసైటీ కార్యదర్శి ఎర్రంశెట్టి శేషుమాధవన్, సభ్యులు కుంచే కోటేశ్వరరావు, బట్రాజు శ్యామలరాజు , కొడాలి కృష్ణ ప్రసాద్ , గుత్తికొండ రాంబాబు, సొసైటీ సిబ్బంది వివిఏ గోపాల్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షులుగా కోన శ్రీనివాస్

విశాలాంధ్ర- ఉంగుటూరు : ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులుగా ఉంగు టూరు మండలం కైకరం గ్రామానికి చెందిన కోన శ్రీనివాస్ శనివారం నియామక పత్రాన్ని హైదరాబాదులో అందుకున్నారు. ఇంటర్నేషనల్ సలహాదారులు సీనియర్

నాయకులు గంజి రాజమౌళి గుప్తా , నేషనల్ నాయకులు ఉప్పల శ్రీనివాస్ గుప్తా చేతుల మీదుగా కోనా శ్రీనివాస్ అందుకున్నారు. ఈ సందర్భంగా నేషనల్ చైర్మన్ అశోక్ అగర్వాల్‌కి,రాష్ట్ర గౌరవ అధ్యక్షులు టిజి భరత్ శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షులు కట్టా రవి కుమార్ పాల్గొన్నారు.

హెచ్చరిక (1వ పేజీ తరువాయి)

పంట కాలవల ద్వారా11,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి బ్యారేజ్ వద్ద పరిస్థితులను పరిశీలించారు. మరింత పెరిగే అవకాశం ఉండడంతో తీసుకోవలసిన జాగ్రత్తలపై అధికారులతో చర్చించారు.

లబ్ది (1వ పేజీ తరువాయి)

తీసుకుంటానని హామీ ఇచ్చారు. కొవ్వూరు – భద్రాచలం రైల్వే లైన్ డీపీఆర్ తయారైందని, త్వరలోనే పనులు మొదలవుతాయని చెప్పారు. చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల్లో పలు చోట్ల టెలిఫోన్ మొబైల్ సిగ్నల్స్ సమస్య ఉన్నకారణంగా కొత్త టవర్ల ఏర్పాటుకు బిఎస్ఎన్ఎల్‌తో మాట్లాడి ఒప్పించినట్లు వెల్లడించారు.

జీలుగుమిల్లి ప్రాంతంలో రానున్న నేవీ డిపో వల్ల ఈ చుట్టుపక్కల ప్రాంతాలన్నీ అభివృద్ధి చెందుతాయని, అటువంటి పెద్ద ప్రాజెక్టుకు అందరూ సహకరించాలని ఎంపీ కోరారు.

గరళం (1వ పేజీ తరువాయి)

ప్లాంట్ల నిర్వాహకులు విఫలం చెందుతున్నారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే జిల్లాలో గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు మంచినీటిని వాటర్ రిజర్వాయర్ల ద్వారా ప్రజలకు అందిస్తున్నారు.

మరోవైపు ఆర్వో ప్లాంట్ల ద్వారా ప్రైవేట్ సంస్థలు నీటిని ప్రజలకు అమ్ముతున్నారు. ఈ రెండు సందర్భాల్లో ప్రజలకు శుద్ధ నీరు అందక అంటు వ్యాధుల బారిన పడుతున్నారు. అది డయేరియా కావచ్చు మరో విధమైన వ్యాధి అయినా కావచ్చు. చాలా స్థానిక సంస్థలలో మంచినీరు సరఫరా చేసేటప్పుడు పైప్ లైన్లు పగిలి నీరు కలుషితం అవుతుంది. కొన్ని ప్రైవేటు ఆర్వో ప్లాంట్లలో సరైన ప్రమాణాలు పాటించకపోవడంతో ఇక్కడ కూడా సమస్య మొదలవుతుంది. జిల్లాలో

అనుమతి పొందిన వాటికంటే అనధికారిక ప్లాంట్లే ఎక్కువ

జిల్లాలో ప్రభుత్వ అనుమతి పొందిన ప్రైవేటు ఆర్వో ప్లాంట్ల కన్నా అనధికార ఆరో ప్లాంట్లు ఎక్కువగా నడుస్తున్నాయి అన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఒక ఆర్వో అన్ని ప్రమాణాలతో నిర్మించాలంటే సుమారు రూ. 25 లక్షల వరకు ఖర్చవుతుంది. అదే నామ్కే వాస్తే అన్నట్లుగా ప్లాంట్ నిర్మిస్తే ఐదు లక్షలకే పూర్తవుతుంది. ఈ ప్లాంట్లలో ఎప్పటికప్పుడు ఫిల్టర్లు మార్చకపోవడం, మరికొన్నిచోట్ల మున్సిపాలిటీ పంచాయతీ నీటిని డబ్బాల్లో నింపి విక్రయిస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. ఈ నీటిలో పీహెచ్ స్థాయి తక్కువగా ఉండడంతో కెప్సిల్లా, ఈకోలి వంటి బ్యాక్టీరియల్ బయటపడటం, మరొకవైపు డబ్బాలు సరిగ్గా కడగకపోవడం, నీటి నమూనాలు తరచూ పరీక్షించకపోవడం ఇలా చాలా కారణాలతో ప్రజలు వ్యాధులు బారిన పడుతున్నారు. నీటిని పరీక్షించాల్సిన సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ప్రజలు వ్యాధుల బారిన పడినప్పుడు ఉరుకులు, పరుగులు పెట్టే అధికారులు ఎప్పటికప్పుడు స్థానిక సంస్థల మంచినీటి సరఫరాలను, ప్రైవేటు ఆర్వో ప్లాంట్లను తనిఖీ చేసి అవి తగిన ప్రమాణాలు పాటిస్తున్నాయా లేదా అన్న విషయం పరిశీలిస్తే ప్రజలు సురక్షితంగా ఉంటారని పలువురు భావిస్తున్నారు.

నిలిపివేయాలి (1వ పేజీ తరువాయి)

మడకంవారి గూడెం,కొత్త చీమల వారి గూడెం,రమణక్కపేట గ్రామాల మధ్యలో జన నివాసాలు నివాసం ఉంటున్న ప్రాంతంలో ఆయుధ డిపో నిర్మాణం వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఏటా రెండు పంటలు పండుతున్న వ్యవసాయ భూములను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండిగా వ్యవహరిస్తూ నేవీ ఆయుధ డిపో నిర్మాణం కోసం భూములు సేకరించడం దుర్మార్గమన్నారు. ఇలాంటి ఆయుధ డిపోను సముద్రం తీరానికి 400కిలోమీటర్లు దూరంలో ఉన్న ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలు పేదలు వ్యతిరేకిస్తున్నా చట్ట విరుద్ధంగా రాష్ట్ర కూటమి ప్రభుత్వం నిర్మాణం చేస్తుందని మండిపడ్డారు. 2013 భూసేకరణ చట్టాన్ని ధిక్కరిస్తూ రాజ్యాంగంలో షెడ్యూల్ 5ని విస్మరిస్తూ, ఏజెన్సీలో ఉన్న పీసా,1/70 చట్టాలను తూట్లు పొడుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరుతో ఏజెన్సీ ప్రాంతంలో ప్రాజెక్టులు, ఫ్యాక్టరీలు తీసుకువచ్చి ఆదివాసీల గొంతు నొక్కుతూ వారి జీవితాలను ఛిద్రం చేస్తున్నారని మండి పడ్డారు. స్వేచ్ఛగా బ్రతికే గిరిజనులు ఈఆయుధ డిపో వస్తే అడుగడుగునా అడ్డంకులు ఎదురై ఉన్నచోట భూమి,ఉపాధి కోల్పోయి స్థానిక ప్రజలు వివిధ ప్రాంతాలకు తరలిపోవాల్సి వస్తుందన్నారు. ఆయుధ డిపోను అటవీ లేదా పంటలు పండని మరో ప్రాంతానికి తరలించాలన్నారు.ఆదివాసీల హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం తీర్మానాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ప్రవేశపెట్టగా దీనిపై రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే.శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలరాణి, ఐ.ఎఫ్.టి.యు. జిల్లా నాయకులు సాలి రాజశేఖర్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు కన్నబాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జె.గోపి, ఆదివాసి సేన రాష్ట్ర అధ్యక్షులు మడకం వెంకటేశ్వరరావు, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ బి.శ్యామల, పిడిఎస్ యు జిల్లా కార్యదర్శి నాని, బికె ఎంయు జిల్లా నాయకులు ప్రభాకర్ రావు, ఏఐకేఎంఎస్ నాయకులు సుందర్ రావు, రైతు కూలీ సంఘం నాయకులు భాస్కరరావు, రమణక్కపేట గ్రామ నాయకులు తెల్లం శంకరుడు, దాట్లవారిగూడెం గ్రామ నాయకులారా కారం నాగదుర్గ మాట్లాడుతూ నేవీ ఆయుధ డిపో నిర్మాణంకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. గత వైసీపీ ప్రభుత్వం ఆయుధ డిపో నిర్మాణానికి పూనుకుందన్నారు.అప్పుడే ప్రజలు రెండుసార్లు పీసా గ్రామ సభలు జరిపి అందరూ ముక్తకంఠంతో వ్యతిరేకించారని గుర్తు చేశారు.నాడు తెలుగుదేశం, ప్రస్తుతం జనసేన ఎమ్మెల్యే సైతం వ్యతిరేకించారని తెలిపారు.నాడు తప్పయినది నేడు ఎలా ఒప్పు అవుతుందో ప్రజాప్రతినిధులే ఆలోచించాలని ఎద్దేవా చేశారు. ఆయుధ డిపో నిర్మాణం కోసం ప్రభుత్వం 1166 ఎకరాలు భూసేకరణ చేసామని జిల్లా కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే ప్రకటించడం దుర్మార్గం అన్నారు. ఈ సమావేశంలో గిరిజన సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, రైతు కూలీ సంఘాలు, కార్మిక సంఘాల నాయకులు ఎస్.రాజశేఖర్, ఎస్. సత్యం, సత్యనారాయణ మరో 20 మంది ప్రజాసంఘాల కార్యకర్తల నాయకులు పాల్గొన్నారు.

ముందస్తు పరీక్షలతో వ్యాధుల నిర్మూలన

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : క్యాన్సర్ వ్యాధిని ముందుగా గుర్తించి వైద్యులు ఇచ్చే మందులను సక్రమంగా వాడితే ఆరోగ్యం మెరుగుపడుతుందని బయ్యనగూడెం గ్రామపంచా యతీ సర్పంచ్ లింగి శెట్టి అనంతలక్ష్మి పేర్కొన్నారు. మండలంలో బయ్యన్నగూడెం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద

శనివారం స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాన్ని డాక్టర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ఎంపీపీ గంజిమల రామారావు ప్రారంభించారు. టిడిపి మండల అధ్యక్షులు పారేపల్లి నరేష్ మాట్లాడుతూ నేటి సమాజంలో జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా మనుషు లలో క్యాన్సర్ వ్యాధులు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. ముందస్తు పరీక్షలు చేయించుకోవడం ద్వారా ప్రాథమిక స్థాయిలోనే వ్యాధిని గుర్తించి చికిత్స పొందుతే ఆరోగ్య సమస్య ఉండదని ఆయన తెలిపారు. అనంతలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలలో గ్రామీణ ప్రాంతాల వారంతా వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా జాయింట్ సెక్రెటరీ మద్దు తేజ, ఆరేటి ఏసుబాబు, బి.నరేష్, డాక్టర్ ఎం.గీతా రాణి, డాక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ అపూర్వ, ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం, అంగన్వాడి సూపర్వైజర్ రాణి, ఆసుపత్రి సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : జీఎస్టి 2.0 సంస్కరణల్లో భాగంగా పన్నుల వ్యవస్థను మరింత సులభతరంగా పారదర్శకంగా పన్ను చెల్లింపు దారులకు లబ్ది చేకూర్చే విధంగా ప్రభుత్వం పలు రకాల వస్తువులు, సేవలపై పన్ను రేట్లను తగ్గించిందని, ఈనెల 25వ తేదీ నుండి అక్టోబర్ 18వ తేదీ వరకు జిఎస్టి తగ్గింపు పై మండలంలో ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కే కిరణ్ కుమార్ తెలిపారు.

జీఎస్టీ తగ్గుదలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర-ముదినేపల్లి : కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించడం వల్ల కలిగే ప్రయోజనాలను గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో వై.రామకృష్ణ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో బి.అశోక్ మాట్లాడుతూ గృహోపకరణాలు, నిత్యావసరాలపై ఎంత శాతం జీఎస్టీ తగ్గింది వాటి వల్ల కలిగే ప్రయోజ

నాలు తెలపాలని అన్ని వర్గాల వారు ఈ అవకాశాలను సద్వినియోగించుకునేలా గ్రామ సచివాలయ సిబ్బంది తెలియజేయాలన్నారు. అక్టోబర్ 1 వరకు నిర్వహించే స్వచ్ఛత హీసేవ ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. అక్టోబర్ 2న పారిశుద్ధ్య పరిరక్షకుకు సన్మానం ఉంటుందన్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-లింగపాలెం: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న పి.సాధనకు తిమ్మిరెడ్డి పల్లికి చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకుడు గంగవల్లి సురేష్ రూ.10 వేలు ఆర్థిక సాయం అందిం చారు. మంగళగిరి కి చెందిన ఈ విద్యార్థినికి క్యాన్సర్ వ్యాధి సోకటంతో ధర్మాజీగూడెంకు చెందిన మిత్రదీప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు తమ సంస్థ ద్వారా రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు.

విశాలాంధ్రలో ఈనెల 15న వచ్చిన కథనంపై సురేష్ స్పందించి పేషెంట్‌కు ఫోన్ పే ద్వారా సాయం అందించారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

విశాలాంధ్ర-టి నరసాపురం: ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని తహశీల్దార్ టి. సాయిబాబా తెలిపారు. మర్రిగూడెం పంచాయతీలోని లంకాలపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన

చెక్‌పోస్టును శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణా రాష్ట్రానికి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న నేపథ్యంలో ఇసుక అక్రమ రవాణా నివారించడానికి తెలంగాణాకు సరిహద్దున గల లంకాల పల్లి లో చెక్ పోస్టు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్ర మంలో సీనియర్ అసిస్టెంట్ హరిబాబు, విఆర్వోలు బోసు, సీతా రామరాజు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కార్యక్రమాలకు అధికారుల నియామకం

విశాలాంధ్ర - పాలకోడేరు : పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ వారి ఆదేశానుసారం పాలకోడేరు మండలంలో సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కార్యక్రమాలకు గ్రామాల వారిగా అధికారులను నియమించినట్లు ఎంపీడీవో వి. రెడ్డియ్య ఒక ప్రకటనలో తెలిపారు. నియమించిన అధికారులు ఈనెల 29 నుండి అక్టోబర్ 19 వరకు ఆయా గ్రామ సచివాలయ పరిధిలోని ప్రజలందరికి జిఎస్టి తగ్గింపు వల్ల కలిగే లాభాలను విస్తృతంగా ప్రచారం చేసి, ప్రజలను చైతన్యవంతం చేయాలని అన్నారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే, జిఆర్‌కె

విశాలాంధ్ర-జీలుగుమిల్లి : రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల అనంతరం శనివారం విద్య ,ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, పోలవరం

నియోజకవర్గం జనసేన పార్టీ అధికార ప్రతినిధి గడ్డమణుగు రవికుమార్ కలిసి శు భాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని విద్యారంగ అభివృద్ధి గురించి మంత్రితో చర్చించినట్లు వారు తెలిపారు. గిరిజన విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు, పాఠశాల భవనాల మరమ్మత్తులు, హాస్టల్లో మౌలిక వసతుల కల్పన, ఉపాధ్యాయుల ఖాళీల భర్తీ పై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు .ముఖ్యంగా గిరిజన ప్రాంతాల విద్యా శాతం పెంచేందుకు డిజిటల్ ఎడ్యుకేషన్, స్మార్ట్ క్లాస్ రూమ్ లో ఉన్నత విద్యకు ప్రోత్సాహాలు అందించేలా ప్రత్యేక పథకాలు అమలు చేయాలని మంత్రిని కోరారు.

గిరిజన సంక్షేమ కమిటీ సభ్యులుగా ఎమ్మెల్యే చిర్రి

విశాలాంధ్ర-జీలుగుమిల్లి : గిరిజన సంక్షేమ కమిటీ సభ్యులుగా పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు నియమితులయ్యారు. శనివారం బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో గిరిజన విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక సదుపాయాల అభివృద్ధికి తాను కృషి చేస్తానని అన్నారు. ఈ నియామకం ద్వారా గిరిజన సమస్యలు అభివృద్ధి కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యత కలుగుతుందని ఆయన అన్నారు.

మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబాల్లో ఆనందం

విశాలాంధ్ర-చింతలపూడి: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబాలు ఆరోగ్యం, ఆనందంగా ఉంటాయని ఏలూరు జిల్లా డిసిహెచ్ఓ డాక్టర్ పాల్ సతీష్ అన్నారు. చింతలపూడి పట్టణంలో స్వస్తినారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శనివారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నారాయణరావు ఆధ్వర్యంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు కొండ్రు దేవా, గుమ్మిశెట్టి భారతి అధ్యక్షతన జరిగింది.

ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు స్త్రీలకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డి సి హెచ్ ఓ మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన స్వస్థనారి స్వశక్తి అభియాన్ కార్యక్రమం చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతి మహిళ వైద్యులను సంప్రదించి వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఏఎంసీ చైర్మన్ చీదరాల దుర్గా పార్వతి, టీడీపీ పట్టణ అధ్యక్షులు తాటి అప్పారావు, నాయకులు బోడ నాగభూషణం, చిత్తూరు ధర్మరాజు, కొత్తపూడి శేషగిరిరావు, జనసేన పార్టీ చింతలపూడి మండల అధ్యక్షులు చేతరాల మధుబాబు, ఏసుబాబు బిజెపి నాయకులు కొత్తపల్లి విజయ కుమారి ఆస్పత్రి సిబ్బంది డాక్టర్ జేబివుల్ల, డాక్టర్ సయ్యద్ రసూల్, డాక్టర్ విజయలక్ష్మి, వైద్య నిపుణులు లైన్స్ క్లబ్ నాయకులు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - కలిదిండి: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను మహిళలు ఉపయోగించుకుని ఆరోగ్య వంతమైన జీవితాలను మెరుగుపరుచు కోవాలని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు. శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలోని మట్టగుంట గ్రామంలో స్వస్థనారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న వైద్య శిబిరంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మహిళలు పని ఒత్తిడిలో పడి తమ ఆరోగ్యాలను నిర్లక్ష్యం చేయకుండా తరచుగా వైద్య పరీక్షలు నిర్వహించుకుని తమ ఆరోగ్యా లను కాపాడుకోవాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, ఆరోగ్యానికి పెద్ద పేట వేస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రజలందరూ ఆరోగ్యవంతులుగా జీవించ డానికి అనేక కార్యక్రమాలు ప్రవేశపెట్టా

రని, ఆయుష్మాన్ భరత్ స్వస్థనారి సశక్త్ పరివార్ అభియాన్ వంటి కార్యక్రమాలు ప్రజలందరూ ఉపయోగించుకుని వ్యాధులు బారిన పడకుండా జీవించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కోకా శ్రీనివాసరావు, నాగిడి. వీరబ్రహ్మం, మూలంక పిహెచ్‌సి వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా పరిశ్రమ దేశానికే గర్వకారణం

విశాలాంధ్ర -భీమవరం: ఆంధ్రప్రదేశ్ ఆక్వా కల్చర్ దేశానికే ఒక గర్వకారణం అని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి శ్రీ భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆక్వా పరిశ్రమకు చెందిన ప్రముఖ ఎగుమతిదారులతో ఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్, జాకరాండా హాల్లో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఆక్వా పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకోవడానికి కేంద్ర మంత్రి ఓపెన్ హౌస్ నిర్వహించి, ఎగుమతి దారులు, రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లపై లోతుగా చర్చించారు. ఈ చర్చల్లో ముఖ్యంగా ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులు, అమెరికా ప్రభుత్వం విధించిన టారీఫ్ వల్ల తలెత్తుతున్న ఇబ్బందులు, ఇతర కీలక అంశాలపై ఎగుమతిదారులు తమ సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఆక్వా పరిశ్రమను మరింత బలోపేతం చేయడానికి ఎగుమతులను పెంచడానికి, రైతుల ఆదాయాన్ని మెరుగుపరచడానికి అవసర మైన అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

శాంతిభద్రతల అదుపునకు చర్యలు

విశాలాంధ్ర -లింగపాలెం: జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని డీఎస్పీ రవిచంద్ర తెలిపారు. ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్ తనిఖీకి వచ్చిన సందర్భంగా విలేకరు

లతో ఆయన మాట్లా డుతూ పలు విష యాలు వివరించారు. డివిజన్ పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్లోనే సిబ్బంది పనితీరుపై డి.ఎస్.పి సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీసులు సక్రమంగా విధులు నిర్వర్తించడం వల్ల ప్రజలు పోలీసులకు ఇచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు.సీసీ కెమెరాలు వల్ల నేరాలకు పాల్పడే వారిని గుర్తించి పట్టుకోవచ్చని అన్నారు. సీసీ కెమెరాలు ఉండటంవల్ల నేరాలు చేసేవారి డేటా నమోదవు తుందని పేర్కొన్నారు. ఇళ్లల్లో సంపద ఉన్నవారు నిర్లక్ష్యంగా ఉండకుండా ఖచ్చితంగా సీసీ కెమెరాలు అమర్చుకోవాలని తెలిపారు. వీటి వల్ల నేరాలు జరగవని నేరాలు జరిగిన వెంటనే గుర్తించి పట్టుకోవ డానికి వీలవుతుందని డీఎస్పీ వివరించారు. తనిఖీకి వచ్చిన డిఎస్పితో చింతలపూడి సర్కిల్ ఇన్ స్పెక్టర్ క్రాంతి కుమార్ ఉన్నారు. స్టేషన్లో రికార్డులను తనిఖీ చేశారు.సిబ్బంది పనితీరును పరిశీలించారు.ఈ సందర్భంగా డిఎస్పి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగనివ్వ వద్దని అన్నారు.ఎస్సై వెంకన్న బాబు డి.ఎస్.పికి స్టేషన్లో, స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలలోని పరిస్థితులను వివరించారు.

భక్తులతో కిక్కిరిసిన శ్రీవారి క్షేత్రం

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకా తిరుమల శేషాచల పర్వతంపై కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామిని వేలాది మంది

భక్తులు కనులారా దర్శించి మనసారా పులకించారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన రోజు శనివారం కావడంతో రాష్ట్ర నలు మూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి దర్శనం క్యూలలో, ప్రసాదాల కౌంటర్లలో, కేశఖండన శాల వద్ద భక్తులు బారులు తీరారు. శ్రీవారి వైకుంఠ క్యూకాంప్లెక్స్ అన్ని కంపార్ట్మెంట్లు భక్తులతో నిండిపోయాయి. భవానీ మాలదారుల తాకిడి కూడా ఎక్కువగా ఉండటంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిశాయి. సామాన్య భక్తులు స్వామివారిని దర్శించు కోవడానికి సుమారు 3గంటల సమయం పట్టింది. వృద్ధులు, దివ్యాంగులు, చంటి బిడ్డ తల్లులను ప్రత్యేక క్యూల ద్వారా దర్శనానికి అనుమతించారు.

కళ్యాణమండపానికి నిధులు

మంజూరు చేస్తా : ఎంపీ

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల యాదవ కళ్యాణ మండపం అభివృద్ధికి రూ.కోటి నిధులు మంజూరు చేస్తానని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ ప్రకటించారు.

స్థానిక యాదవ కళ్యాణ మండపాన్ని శనివారం ఆయన సందర్శించి సౌకర్యాలను పరిశీలించారు. ముందుగా ఆయనకు జిల్లా యాదవ సంఘం నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్వారకాతిరుమలలో యాదవ కళ్యాణ మండపానికి రూ. కోటి రూపాయిలు కాకుండా అవసరం మేరకు ఇంకా నిధులు సమకూరుస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏలూరు రుడా కార్పోరేషన్ చైర్మన్ పెద్దబోయిన శివ ప్రసాద్, యాదవ కార్పోరేషన్ డైరెక్టర్ పెనుబోయిన మహేష్, జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు ముమ్మిడి చింతయ్య, ఉపాధ్యక్షుడు కంపసాటి రామకృష్ణ, కార్యదర్శి కూరాకుల బుజ్జి, గంపా రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు మాన్యువల్ కౌన్సిలింగ్ ద్వారా పోస్టింగ్ కేటాయించాలి : ఆప్టా

విశాలాంధ్ర - ఏలూరు : డీఎస్సీలో ఎంపికైన నూతన ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సిలింగ్ ద్వారా ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం డిమాండ్ చేసింది. ఇచ్చిన మాట ప్రకారం డిఎస్సి పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించిన పాఠశాల విద్యా శాఖకు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు, కూటమి ప్రభుత్వానికి హృదయ పూర్వక అభినందనలు తెలుపుతున్నట్లు ఆప్టా ఏలూరు జిల్లా అధ్యక్షులు సిహెచ్. శివరామ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు చెప్పారు. నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు జిల్లాలోని అన్ని పాఠశాలల వివరాలు, వాటి అవాస ప్రాంతాలపై అవగాహన ఉండద న్నారు. అందువల్ల మంత్రి లోకేష్, పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు మానవతా దృక్పథంతో ఆలోచించి వారికి మాన్యువల్ కౌన్సెలింగ్ జరిపించి న్యాయం చేయాలని ఆప్టా సంఘం తరపున కోరారు.

ప్రతి మహిళ రక్తహీనత లేకుండా చూసుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గణపవరం 2సచివాలయం లో స్వస్థ నారి శశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ముందుగా అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పీహెచ్సి వైద్యాధికారి డాక్టర్ కమతం ఓంకార్ నాథ్ ఆధ్వర్యంలో క్యాంపు నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ ప్రతి మహిళకు రక్తహీనత లేకుండా చూసుకోవాలని మహిళలకు ఆరోగ్యం పై వైద్య ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. చికిత్స ,పరీక్షలు, ప్రత్యేక వైద్య నిపుణుల సేవలను ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం ద్వారా అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్, క్యాన్సర్ ,స్క్రీనింగ్ ప్రసూతి సంరక్షణ, మరియు తల్లి బిడ్డ సంరక్షణ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, రక్తహీనత స్క్రీనింగ్, రుతు పరిశుభ్రత పీఎం జేవివై వందనా కార్డు, పోషణ అభియాన్, రక్తదానము , క్షయవ్యాధి స్క్రీనింగ్, ఆయుష్ సేవలు, అధిక రక్తపోటు, మధుమేహము, నోటి క్యాన్సర్, వ్యాధులపై ఈ శిబిరాలలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. 235 మందిని పరీక్షించి మందులు ఉచితంగా అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు తోట శీను, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జాలాది విల్సన్‌బాబు, వీరంకి శ్రీనివాస్, కూటమి నాయకులు, హెచ్‌విసిహెచ్ పద్మజ, బాలమురళీకృష్ణ, ఆశాజ్యోతి, నున్న పాప, అంగన్వాడి కార్యకర్తలు సహాయకులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిరక్షించుకుందాం

విశాలాంధ్ర-ఏలూరు: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే సమాజం ఆరోగ్యవంతంగా ఉంటుందని టిడిపి ఎస్.సి., సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, 3వ డివిజన్ ఇన్‌ఛార్జి జాలా బాలాజీ పేర్కొన్నారు. స్థానిక శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ఆదేశాలకు అనుగుణంగా శనివారం స్థానిక 3వ డివిజన్‌లో మురుగు కాలవలలో పేరుకుపోయిన చెత్త చెదారంతో పాటు,వ్యర్థ పదార్థాలను వెలికి తీసి డ్రైనేజీలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా జాలా బాలాజీ మాట్లాడుతూ డ్రైన్ నిండా ప్లాస్టిక్ వ్యర్థాలు, కదలని మురుగుతో కాలనీవాసులు ఇక్కట్లు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. మురుగునీటితో దుర్గంధం వెదజల్లుతూ దోమలకు ఆవాసాలుగా ఉండటం వలన ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు.తక్షణం స్పందించి పారిశుద్ధ్య కార్మికులతో 3వ డివిజన్‌లో పూడికతీత పనులు చేపట్టి మురుగునీరు సాఫీగా వెళ్లేందుకు పటిష్టమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు.భవిష్యత్తులో పారిశుద్ధ్యం విషయంలో ప్రత్యేక ప్రణాళిక చేపట్టి డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.

జీవో5ను సవరించాలి

శాసనమండలి సభ్యులు వంక రవీంద్రనాథ్

విశాలాంధ్ర-తణుకు: వివాదాలకు ,మనస్పర్థలకు దారి తీసే జీవో నంబర్ 5 ను సవరించాలని శాసనమండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం శాసనమండలిలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా శాసనమండలిలో జీవో నెంబర్ 5ను వంక రవీంద్రనాథ్ ప్రస్తావిస్తూ దొమ్మరి కులం వారు తమ కుల పేరు ప్రస్తావన సమాజంలో గౌరవ ప్రదంగా లేని కారణంగా వారి మనసులు నొచ్చు కుంటున్నా యని పేర్కొన్నారు. దొమ్మర కులం పేరును దొమ్మర (గిరి బలిజ) గా పేరు మారుస్తూ జి ఓ చేయడం బలిజ కుల ప్రజలు తీవ్ర అభ్యతరం చెపుతున్నారని తెలిపారు.పేరు మార్చాలంటే ఏదైనా కొత్త పేరు పెట్టాలని, దొమ్మరి అనే పేరు తీయకుండా బ్రాకెట్‌లో గిరి బలిజ అని పేరు జత చేయడం, దొమ్మరి కులస్తులు కూడా సంతృప్తికరంగా లేరన్నారు. ప్రత్యేక చారిత్రక నేపధ్యం ఉన్న బలిజ పేరును వేరే కులానికి అంటగట్టడం ఎంతమాత్రం సరికాదన్నారు. గిరి దొర, గిరి నాయక అని పేరు పెట్టి వారిని గౌరవించాలని, సంప్రదాయాలకు సంబంధంలేని కులం పేరుతో పిలవడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే జీవోను సరిచేసి ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత జి.ఒ.,ను పునః పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నిర్ణీత సమయంలో నిత్యావసరాలు అందజేయండి

విశాలాంధ్ర- ఏలూరు : ప్రజలకు నిర్ణీత సమయంలో నిత్యావసర సరుకులు అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి విలియమ్స్‌ను జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ ఆదేశించారు. శనివారం ఏలూరులోని జెడ్పి క్యాంపు కార్యాలయంలో చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్‌ని డీఎస్ఓ విలియమ్స్ మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేసారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ పద్మశ్రీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రజలకు అత్యంత ప్రాధాన్యత గల పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ, బియ్యం నాణ్యత, మిల్లర్ల వద్ద నిల్వలు, రేషన్ దుకాణాల సరఫరా వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. రాబోయే పండుగలను దృష్టిలో పెట్టుకొని జిల్లాలో ధాన్యం, ఇతర నిత్యావసర సరుకులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందుగానే నిల్వ చేసి నిర్ణీత సమయానికి ప్రజలకు పంపిణీ చేయాలని సూచించారు. జిల్లాలో ప్రతి నెలా నిర్ణీత షెడ్యూల్ ప్రకారం సరుకులు అందజేయాలని, నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితులలోనూ రాజీ పడకూడదని ఆదేశించారు. రేషన్ దుకాణాలపై తరచూ తనిఖీలు నిర్వహించి ప్రజల అభిప్రాయాలను తెలుసుకొని తగు మార్పులు చేర్పులు చేయాలని సూచించారు. ప్రజలకు సివిల్ సప్లయ్ శాఖపై నమ్మకం పెరిగేలా పారదర్శకతతో, సమర్థవంతంగా వ్యవహరించాలని, ప్రభుత్వ సంకల్పాన్ని ప్రతీ కార్డుదారుని గడపకు చేరవేయాలని చైర్పర్సన్ పద్మశ్రీ ప్రసాద్ సూచించారు.

ఊరుకోం (1వ పేజీ తరువాయి)

నిర్మించారని గుర్తు చేశారు. అటువంటి రిక్షా స్టాండును నేడు పట్టణ సుందరీకరణ పేరుతో తొలగించాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరికో ప్రయోజనం చేకూర్చడం కోసం రిక్షా కార్మికుల బ్రతుకులపై ప్రతాపం చూపించడం పద్ధతి కాదన్నారు. డ్వాక్రా మహిళలకు, మెకానిక్‌లకు, చిరు వ్యాపారులకు చేతివృత్తిదారులకు అన్యాయం జరిగినా చూస్తూ ఊరుకునేది లేదన్నారు. రిక్షా స్టాండ్ బోర్డును అధికారులు తొలగించారని 24 గంటల్లో ఆ బోర్డు యధా స్థానంలో పెట్టకపోతే ఎమ్మార్పీఎస్ ఆందోళనకు దిగుతుందని హెచ్చరించారు. ఎనిమిదో వార్డు కౌన్సిలర్ మండపల్లి రవికుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రిక్షా కార్మికులకు నీడనిచ్చేందుకు మాజీ మంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్ రేకు షెడ్డు నిర్మాణం చేసి రక్షణ కల్పించారన్నారు. ఇప్పుడు ఆ షెడ్డును తొలగించాలని చూడడం అన్యాయమని పేర్కొన్నారు. అక్కడ ఉన్న రిక్షా స్టాండ్‌ను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయా నికి వెళ్లి కమిషనర్ టీవీ రంగారావుకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్ర మంలో జై భీమ్ రిక్షా కార్మికుల పట్టణ అధ్యక్షుడు అయినవిల్లి రవణ మాదిగ, సీపీఐ జిల్లా నాయకులు రామకృష్ణ, రిక్షా కార్మికులు బుట్టా వీర్రాజు, ఏల్చూరి ఏసు, చాపల సత్తిన్న, కొమ్ము సత్యనారాయణ, ఏడిద ఏసు, పెంటయ్య, కొల్లి శ్రీను, అధిక సంఖ్యలో రిక్షా కార్మికులు, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

CHANGE OF SURNAME

I MOHAMMED ABDUL RAJAK (Old Name), S/o. SHAIK BASHA, resident of D.No: 7-172, Near Ganugula Oil Shop, Chetaparru Road, Eluru-534004, W.G.District, A.P. I have changed my Surname as **SHAIK ABDUL RAJAK (New Name), S/o. SHAIK BASHA,** Hereafter my name is known as **SHAIK ABDUL RAJAK (New Name), S/o. SHAIK BASHA.**

పాముకాటుకు నిరంతరం వైద్య సేవలు అందించాలి : సీపీఐ డిమాండ్

విశాలాంధ్ర-చాట్రాయి: చాట్రాయి ప్రభుత్వ ఆసుపత్రిలో నిరంతరం పాముకాటుకు వైద్య సేవలు అందించాలని సీపీఐ నూజివీడు నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు ఈవి శ్రీనివాస్

డిమాండ్ చేశారు. శనివారం చాట్రాయి తహసీల్దార్ కార్యాలయంలో సీపీఐ మండల నాయకులు కొమ్ము ఆనందంతో కలిసి ఆసుపత్రిలో వినతిపత్రం అందజేశారు. ఇటీవల మండలంలోని చిన్నంపేట గ్రామంలో కూలి పనులకు వెళ్ళిన మహిళను పాము కాటు వేస్తే చాట్రాయి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చినా సరైన చికిత్స అందకపోవ డంతో ఆమె మరణించింది అన్నారు. దీనిపై మృతురాలి కుటుంబీకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. 24 గంటలు ఆసుపత్రిలో సరైన వైద్య సేవలు అందకపోవడం చాలా బాధాకరమన్నారు.

నాగబాబును కలిసిన ఎమ్మెల్యే, జిఆర్‌కె

విశాలాంధ్ర-జీలుగుమిల్లి : ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబును శనివారం అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, పోలవరం నియోజకవర్గ అధికార ప్రతినిధి గడ్డమణుగు రవికుమార్ కలిశారు. పోలవరం నియోజక వర్గంలోని ఏడు మండలాల అభివృద్ధి కొరకు నివేదిక ఇవ్వడం

జరిగిందని వారు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఇతర మంత్రులతో మాట్లాడి పోలవరం నియోజకవర్గ అభివృద్ధికి మాట్లాడుతానని, సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ఎమ్మెల్సీ నాగబాబును కలిసిన వారిలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాస్, పులపర్తి రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయ ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా డీఎస్సీ 2025లో తన కుమార్తె సుదగాని స్వప్నకు ఎస్ జి టి టీచర్ ఉద్యోగం రావడం ఎంతో సంతోషకరంగా ఉందని రాజవరం గ్రామ టిడిపి అధ్యక్షుడు సుదగాని సత్యనారాయణ తెలిపారు. ఎస్జీటీలో 109వ ర్యాంక్ సాధించిన ఆమెకు రాష్ట్ర రాజధాని అమరావతిలో ఉద్యోగ నియామక పత్రాన్ని ఉన్నత అధికారులు అందజేసినట్లు స్వప్న తెలిపారు. తనకు ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం రావడం ఆనందంగా ఉందని ఆమె పేర్కొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా ప్రతాప్

విశాలాంధ్ర-దేవరపల్లి: యర్నగూడెం శాఖ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా బొడ్డు ప్రతాప్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన గ్రంథాలయ అభివృద్ధి కమిటీ నియామకాలు చేపట్టాలనే ప్రభుత్వ ఆదేశాలపై యర్నగూడెం శాఖ గ్రంథాలయంలో మండల విద్యాశాఖ అధికారి ఎస్‌వివి అప్పారావు సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఎస్ వివి అప్పారావు మాట్లాడుతూ గ్రంథాలయం ఆధునిక దేవాలయమని గ్రంథాలయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, గ్రంథాలయ అభివృద్ధి తోడ్పడాలని, సమావేశంలో 11మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారని అధ్యక్షుడిగా బొడ్డు ప్రతాప్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా ఎలిగంటి వెంకటస్వామి, కార్యదర్శిగా చింతా సాయి, చైతన్య సహాయ కార్యదర్శిగా జగతి పరమేశ్వరరావు, తదితర సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారని శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బొంతా భరత్ బాబు ఎంపీటీసీ బొంతా చినబాబు తెదేపా అధ్యక్షుడు బొల్లిన విజయభాస్కర్ జనసేన అధ్యక్షుడు వర్దినీడి నరేంద్ర గద్దె శ్రీనివాస్ విఆర్ఓ చాంద్ భాషా నూకల కరుణాకర్ పాలూరి బాలాజీ గ్రంథాలయ అధికారిణి జీ అనిత పాల్గొన్నారు

శ్రీ సత్యసాయి పథకం నిర్వహణకు రూ.కోటి నిధుల మంజూరు

విశాలాంధ్ర - సీతానగరం: శ్రీ సత్యసాయి త్రాగు నీటి పథకం నిర్వహణకు రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ చొరవతో కోటి రూపాయలు నిధులు విడుదల చేసిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. గత కొంత కాలంగా అనేక సమస్యలతో శ్రీ సత్యసాయి తాగు పథకం అనేక సార్లు నీటి సరఫరాకు అంతరాయాలు ఏర్పడింది. ఈ సమస్యల పై ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి సమస్యను తీసుకొని వెళ్లారు. ఈ సమస్యపై వారు ఇరువురు స్పందించి తాత్కాలికంగా మంచి నీటి పథకం నిర్వహణకు కోటి రూపాయలను మంజూరు చేశారు. ఈ నిధులతో సిబ్బంది జీతాలు, పథకం నిర్వహణ కోసం ఖర్చు చేయడం జరుగుతుంది అని అన్నారు. దీనితో శ్రీ సత్యసాయి పథకం ద్వారా మంచి నీటి సరఫరాకు ఇబ్బందులు తొలగనటట్టే అని అన్నారు. ఈ సమస్యపై స్పందించి నిధులు మంజూరు చేసిన సీఎం, డిప్యూటీ సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అమ్మవారిని దర్శించుకున్న ఐజి

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : రాజమండ్రి దేవీచౌక్ సెంటర్‌లో శరన్నవ రాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం మధ్యాహ్నం ఐజి అశోక్ కుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు. జిల్లా ఎస్‌పిడి నరసింహ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

స్మశాన వాటికల నిర్మాణాలకు ప్రభుత్వం సహకరించాలి

విశాలాంధ్ర గోపాలపురం : నగరికరణ విస్తరించిన క్రమంలో గ్రామీణ పల్లె ప్రాంతాలలోని మృతి చెందిన భౌతిక కాయం (మృత దేహం)లను వారి సాంప్రదాయాల ప్రకారం ఖననం చేసేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారికి స్మశానవాటికలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అసెంబ్లీ సమావేశాలలో 8 రోజు తన వాణిని వినిపించారు. దశాబ్దాల క్రితం ఊరికి దూరంగా ఉన్న స్మశాన వాటికలు గ్రామీణ పల్లి ప్రాంతాలలో కుటుంబాలు సంఖ్య విస్తరించిన కారణంగా కొన్ని గ్రామాలలో ఇండ్ల మధ్యలోనే స్మశానాలు ఉన్నాయని తెలిపారు. క్రైస్తవ దళిత మైనారిటీ మరికొన్ని సామాజిక వర్గాలు తమ కుటుంబాల్లో మృతి చెందిన వారిని భూస్థాపన చేసేందుకు స్థలాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మరికొన్ని సామాజిక వర్గాలు మృతదేహాలను దహనం చేసేందుకు సుదూర ప్రాంతాలు వెళ్లవలసిన పరిస్థితి నెలకొందని ఆయన తెలిపారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి గ్రామాలలో స్మశాన వాటికలు ఏర్పాటుకు ప్రభుత్వ సహకరించాలని, ప్రభుత్వం అదేవిధంగా నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాలలో దహన వాటికలు నిర్మించి ఆదుకోవాలని కోరారు. ఇప్పటికే రైతు సమస్యల విషయంలో, సాంకేతిక విద్య పట్ల విద్యార్థుల భవిత పట్ల మాట్లాడినందుకు ఈ ప్రభుత్వం ద్వారా తమకు పూర్తి న్యాయం జరుగుతుందని ఆశతో వున్నానన్నారు.

ఈవీఎమ్ గోడౌన్ పరిశీలన

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు మేరకు చేపట్టే సాధారణ తనిఖీల్లో భాగంగా శనివారం ఉదయం ఈవీఎమ్ గోడౌన్ ను పరిశీలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా, స్థానిక FCI గోడౌన్‌లో భద్రపరచిన ఈవీఎమ్ గోడౌన్‌ను కలెక్టర్, రాజమండ్రి ఆర్డీశక్ష ఆర్. కృష్ణ నాయక్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి సందర్శించడం జరిగింది. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు ప్రకారం నియోజకవర్గాలు వారీగా ఈవీఎమ్‌లను భద్రపరచిన గోడౌన్ ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సందర్శించి, తనిఖీలు చేపట్టడం, సంబంధిత రిజిస్టర్‌లో సంతకాలు చేయించడం జరుగుతుందని చెప్పారు. స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎమ్‌లను నిరంతర CCTV కెమెరాల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉంచడం జరుగుతుందని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట ఈవీఎమ్ నోడల్ అధికారి రాజమండ్రి ఆర్డీవో ఆర్. కృష్ణ నాయక్, అర్బన్ తహసీల్దార్ పి. హెచ్.జి. ఆర్. పాపారావు, రాజకీయ పార్టీల ప్రతి నిధులు బి. రామచంద్ర రావు బీజేపీ, దత్తాత్రేయ శర్మ బీజేపీ, ఆనంద్- TDP, నాగరాజు, జనసేన , రెవెన్యూ, భద్రత సిబ్బంది పాల్గొన్నారు

ప్రత్యేక ఆధార్ క్యాంపులు

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలో మూడు గ్రామాల్లో ఆధార్ ప్రత్యేక క్యాంపుల ద్వారా ప్రజలకు ఆధార్‌పై వివిధ సమస్యలను పరిష్కారం అందించారు. ఈ ఆధార్ ప్రత్యేక క్యాంపుల సెప్టెంబర్ 23 నుంచి 27 వరకు మిర్తిపాడు, బొబ్బిల్లంక, ముగ్గళ్ళ గ్రామాల్లో సచివాలయం సిబ్బంది నిర్వహించారు. ఈ క్యాంపుల ద్వారా మొత్తం 164 ఆధార్ అర్జీదారుల సమస్యలను పరిష్కారం అందించారు. ఈ క్యాంపులు సెప్టెంబర్ 26తో ముగియవలసి ఉండగా ఆధార్ అర్జీదారులు ఎక్కువగా ఉండడంతో సెప్టెంబర్ 27 ఆధార్ ప్రత్యేక క్యాంపును కొనసాగించి ప్రజలకు సేవలు అందించారు. ఇంకా ఆధార్ సేవలను కొనసాగిం చడానికి భవిష్యత్తులో ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు మరిన్ని ఆధార్ క్యాంపులు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని అధికారులు తెలిపారు.

శస్త్రచికిత్సలు సమర్థవంతంగా చేసేందుకు శిక్షణ దోహదం

విశాలాంధ్ర - రాజానగరం : అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సలను సైతం సమర్థవంతంగా చేసేందుకు ఇటువంటి ఫెలోషిప్(శిక్షణ తరగతులు) దోహద పడతాయని జిఎస్ఎల్ హాస్పిటల్ చైర్మన్,ఫెలోషిప్ ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు అన్నారు. కాలేయం, పిత్తాశయం, క్లోమము యొక్క పైపులను అధ్యయనాలపై(ఈఆర్‌సిపి) మండలంలోని జిఎస్ఎల్ వైద్య కళాశాల, ఆసుపత్రి నందు ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు ప్రముఖ వైద్యులకు అందించనున్న శిక్షణ తరగతులు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దేశ నలుమూలల నుంచి అధిక సంఖ్యలో ప్రముఖ వైద్యులు హాజరుకాగా, హాస్పిటల్‌లోని 6 ఆపరేషన్ థియేటర్లలో జరిగిన 36 శస్త్రచికిత్సలను ప్రత్యక్షంగా తిలకించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సదస్సు చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ ఫెలోషిప్ శిక్షణ పొందడం ద్వారా క్లిష్టమైన శస్త్రచికిత్సలను సురక్షితంగా, సమర్థవంతంగా చేయగల నైపుణ్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని వైద్యులు పొందుతారన్నారు. తద్వారా వైద్య వృత్తిలో రోగుల భద్రతకు ఎంతో మేలు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న వైద్యుల నైపుణ్యాలను పెంచడంలో తమ విద్యాసంస్థలు కీలక పాత్ర పోషిస్తూ జాతీయ స్థాయిలో తన ప్రత్యేకతను చాటుకుందనీ హర్షం వ్యక్తం చేశారు. సదస్సు కార్యదర్శి డాక్టర్ సమీర్ రంజన్ నాయక్ మాట్లాడుతూ ప్రఖ్యాత వైద్యులతో జీఎస్ఎల్ హాస్పటల్లో అందిస్తున్న ఫెలోషిప్ వర్క్ షాప్‌కి 96 మంది ప్రముఖ వైద్యులు హాజరైనట్టు చెప్పారు. ఆధునిక వైద్య శిక్షణలో ఒక కీలక ఘట్టానికి జిఎస్ఎల్ ఒక వేదికైందన్నారు. ఎండోస్కోపిక్ రెట్రోగ్రేడ్ కొలాంజియోపాంక్రియాటోగ్రఫీ(ఈఆర్‌సిపి) ద్వారా సంక్లిష్ట సమస్యలను గుర్తించి,చికిత్స చేయడానికి ఉపయోగించే ఒక ప్రత్యేకమైన ఎండోస్కోపీ విధానమ న్నారు. సదస్సు ఫాకల్టీ డాక్టర్ అరుణ్ కార్యంపూడి మాట్లాడుతూ ఇటువంటి ఫెలోషిప్ ద్వారా వైద్యులు సాధన చేయడం ద్వారా ఎటువంటి రిస్క్ లేకుండా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నారు. నిజమైన కణజాలంపై పనిచేస్తున్న అనుభూతిని, ఆపరేషన్ సమయంలో ఎదురయ్యే రక్తస్రావం వంటి ఊహించని పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో అన్న అంశాలపై వివరించారు. అనంతరం ఈఆర్‌సిపి విధానాలపై దేశంలోనే ప్రఖ్యాత గాంచిన వైద్యులు ఈశ్వరమూర్తి, సతీష్ కుమార్ మిధా, జి సిద్దేష్, అరుణ్ కార్యంపూడి, సమీర్ రంజన్ నాయక్ వేగుళ్ల వెంకట ముఖేష్ లు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జిఎస్ఎల్ ఆసుపత్రి వైద్యులు,వివిధ విభాగాల అధిపతులు,పిజి విద్యార్థులు పాల్గొన్నారు.

29న ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-దేవరపల్లి: గ్రామీణ ప్రాంత వాసులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని దేవరపల్లి సుమంత్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ కే సుమంత్ తెలిపారు. దేవరపల్లిలో శనివారం సుమంత్ మల్టీ స్పెషల్ ఆస్పత్రిలో 29న వరల్డ్ హార్ట్ డేసందర్భంగా ఉచిత వైద్య శిబిరం మూడు రోజులు పాటు ఉచిత వైద్య శిబిర నిర్వహి స్తున్నట్లు డాక్టర సుమంత్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ తమ ఆసుపత్రిలలో మూడు రోజులపాటు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి 15 విభాగాలకు చెందిన వైద్య నిపుణులు ఉచిత సేవలు అందించనున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని గోపాలపురం నియోజకవర్గంలో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కూచిపూడి నృత్యం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం కొత్తగూడెం గ్రామంలో శ్రీ కోదండరామ ఆలయం వద్ద దసరా ఉత్సవాల సందర్భంగా కొత్తగూ డెం శ్రీ ప్రసన్న ఆంజనేయ కూచిపూడి నృత్యం మండలి వారిచే కూచిపూడి నృత్యం నిర్వహి చారు. ఈ కార్యక్రమంలో గురువు రామ్ చరణ్, నల్లమాటి లలిత, గ్రామస్తులు పాల్గొన్నారు

సంపద సృష్టిపై అవగాహన

విశాలాంధ్ర కోరుకొండ : కోరుకొండ మండలంలోని గ్రామపంచాయతీ సర్పంచులకు కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో బత్తిన అశోక్ కుమార్ ప్రారంభించారు. మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. గ్రామపంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో పంచాయతీ అభివృద్ధికి తీసుకో వాల్సిన చర్యలు, గ్రామపంచాయతీ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం సంపద సృష్టించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. రెండు రోజులపాటు ఈ శిక్షణ కార్యక్రమం జరుగుతుందని తెలియజేశారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మహేశ్వర్ ప్రతాప్, మండల పరిషత్ పరిపాలనాధికారి శామ్యూల్ సతీష్ బాబు, సర్పంచులు, మద్దాల రమణ, దూది కాంతారావు, దారా యశోదరాంబాబు వివిధ గ్రామపంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - గోపాలపురం : మహిళల ఆరోగ్య పరిరక్షణ కొరకు ఏర్పాటు చేసన వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని పెంపొందించు కోవాలని సర్పంచ్ జొన్నకూటి మణెమ్మ కోరారు. శనివారం మండలంలోని వాదాలకుంట గ్రామ సచివాల యం వద్ద స్వస్థ నారి -సశక్తి పరివార్ అభియాన్ వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభిం చారు. ఈ సందర్భంగా సర్పంచ్ మణెమ్మ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు మెరుగైన వైద్యం అందించాలని ఉద్దేశంతో ప్రత్యేకమైన వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాయని గ్రామీణ పల్లె ప్రాంతాల్లోని ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలనీ అన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే సంపూర్ణ పౌష్టిక ఆహారం గర్భవతులు, బాలింతలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్ర్రమంలో ఉప సర్పంచ్ వల్లభని సత్యనారా యణ, ఎం ఎల్ హెచ్ పి రమ్య, ఏఎన్ఎం పుష్ప కాంత, సిబ్బంది హెల్త్ సూపర్వైజర్లు త్రిమూర్తులు, ఆశా వర్కర్లు ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ధార్ గ్యాంగ్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

విశాలాంధ్ర - సీతానగరం: దోపిడీలకు, దాడులకు పాల్పడే మధ్యప్రదేశ్‌కి చెందిన ధార్ గ్యాంగ్ తూర్పుగోదావరి జిల్లా పరి సరాల ప్రాంతాల్లో తిరుగుతోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ డి రామ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సీతానగరం మండలంలో ఉన్నా గ్రామాలు, పరిసర ప్రాంతాలలో రాత్రి వేళల్లో ప్రజలు ఒంటరిగా తిరగవద్దని, ముఖ్యంగా అర్ధరాత్రుళ్లు ఎవరైనా తలుపు తడితే తీయ వద్దని హెచ్చరిక జారీ చేశారు. మధ్యప్రదేశ్‌కి చెందిన ధార్ గ్యాంగ్ గ్రామాల్లో ఉన్న శివారు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ గ్యాంగ్ దోపిడి సమయంలో అడ్డువచ్చిన కుటుంబ సభ్యులపై దాడులు చేస్తున్నారు. ఆపై ఇళ్లల్లో ఉన్న బంగారం, డబ్బు, ఇతర విలువైన ఆభరణాలు దోచు కుంటున్నారన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే అనుమానాస్పదంగా ఎవరైనా మీ గ్రామాలలో తిరుగుతుంటే వెంటనే పోలీ సులకు సమాచారం ఇవ్వాలని కోరారు. రాత్రి వేళల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పేరు మార్పు

నేను అనగా **ఫిక్కి భవానీ/ భువనేశ్వరి** అను నేను జగన్నాధం పోలేరమ్మ దంపతులకు ది.**06-08-1994**న జన్మించితిని. పాఠశాలలో నాపేరు **భువనేశ్వరి** అని ఉన్నది. నా ఆధార్ కార్డులో **పిక్కి భవానీ** అని తీసుకోవడం జరిగింది. ది.**21-08-2013**న **చొక్కా రామకృష్ణ** గారితో వివాహం జరిగింది. వివాహ సమయంలో జాతకరీత్యా **పిక్కి గౌరీ**గా మార్చి వివాహం చేశారు. పై విషయములు అన్నియు యదార్థములు అని పరిగణించి నా పేరు మార్పుకు అవసరమగు ఎనగ్జరీ-2 ఇప్పించవల సిందిగా శ్రీ అధికారుల వారిని కోరుచున్నాను.

చొక్కా గౌరి, భర్తచొక్కా రామకృష్ణ
దాసవాయిపేట గ్రామం
తొండంగి మండలం, కాకినాడ జిల్లా

ఉత్పత్తులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి : కమిషనర్

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : వీధి విక్రయదారులు తమ ఉత్పత్తులలో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ , ఆయా వ్యాపారాలలో రాణించాలని అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్ ఆకాంక్షించారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఆనం కళా కేంద్రంలో వీధి విక్రయదారులకు శనివారం లోక్ కళ్యాణ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ, లేబర్ డిపార్ట్ మెంట్‌లతో పాటు పొదుపు సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. వీధి వ్యాపారులకు హెల్త్ క్యాంప్ ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ మేళాలో దాదాపు 1,200 మంది వీధి విక్రయదారులు పాల్గొనగా.. పీఎం స్వనిధి మొదటి విడత రుణం కోసం 325., రెండు, మూడు విడతల రుణాల కోసం 465 దరఖాస్తులు వచ్చాయి. తొలుత వీధి ఆహార విక్రేతలకు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ పై శిక్షణ ఇవ్వడం జరిగింది. అనంతరం అదనపు కమిషనర్ మాట్లాడుతూ, రుణదారులు బ్యాంకుల ద్వారా రుణం పొందడం ద్వారా వడ్డీ వ్యాపారులపై ఆధారపడకుండా, ప్రభుత్వ రాయితీలను పొందే అవకాశం ఉంటుందన్నారు. వీధి విక్రయదారులు, చిరు వ్యాపారులకు పీఎం స్వనిధి 2.0 ద్వారా మొదటి విడతలో రూ.15 వేలు., రెండవ విడతలో రూ.25 వేలు., మూడవ విడతలో రూ.50 వేల వరకు రుణాలు అందనున్నట్లు వివరించారు. ఈ సాయంతో కూరగాయులు, పండ్లు, పచ్చళ్లు, టిఫిన్స్, పాల వ్యాపారం, బొమ్మలు, వంటి వ్యాపారాలు ప్రారంభించి వ్యాపార రంగంలో రాణించాలని ఆకాంక్షించారు. ఇప్పటివరకు రుణాలు పొందని అర్హులైన లబ్దిదారులు మెప్మా కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మెప్మా జిల్లా ప్రాజెక్ట్ డైరక్టర్ టి.కనకరాజు మాట్లాడుతూ, 2020 జూన్ లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం స్వనిధి పథకం ద్వారా ఇప్పటివరకు మూడు విడతలలో అనేక మంది తక్కువ వడ్డీతో వచ్చే రుణాలను తీసుకుని తమ వ్యాపారాలను విస్తరించారన్నారు. పునః రూపకల్పన చేసిన పీఎం స్వనిధి 2.0 పథకం కింద జిల్లాలో కొత్తగా దరఖాస్తులను ప్రోత్సహించనున్నట్లు వెల్లడించారు. అనంతరం 81 మంది వీధి విక్రయదారులకు రుణాలకు సంబంధించి రూ.31 లక్షల 25 వేల రూపాయల విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిటీ ప్లానర్ జి.కోటయ్య, జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రూకయ్య, లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ప్రకాష్, యూనియన్ బ్యాంక్ ఎఫ్ సిసి ఇంఛార్జి చిట్టితల్లి, సీఎంఎం రామలక్ష్మి, శానిటేషన్ సూపర్ వైజర్ రెడ్డి, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరక్టర్ యానాపు యేసు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశీ నవీన్, టీడీపీ నగర అధ్యక్షులు మజ్జి రాంబాబు, టౌన్ వెండింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, ఇతర మెప్మా సిబ్బంది, వీధి విక్రయదారులు పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించాలని అంబేద్కర్ విగ్రహాలకు వినతి

విశాలాంధ్ర -కొవ్వూరు : తూర్పుగోదావరి జిల్లా 19 మండలాల్లో ఆంధ్రప్రదేశ్ సచివాలయ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు శనివారం కొవ్వూరు మండలం దొమ్మేరు, కాపవరం, ధర్మవరం, తోగమ్ము , మద్దూరు, వేములూరు, కుమార దేవం, ఆరికరేవుల సచివాలయ ఉద్యోగులు గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను సచివాలయ సిబ్బంది అందజేసి తమ నిరసన తెలియజేశారు.ఈ సందర్భంగా కొవ్వూరు మండల సచివాలయ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులను మాతృ శాఖలకు పంపించాలని, జూనియర్ అసిస్టెంట్ స్కేల్ అమలు చేయాలి, నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలి, ప్రభుత్వ సెలవు దినాలలో బలవంతపు పనులు అప్పగించరాదు. ఉద్యోగుల ఇంటింటి సర్వే పేరుతో వేధింపులు నిలిపివేయాలి ఆత్మగౌరవం కాపాడలన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు మండలంలోని అన్ని సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నేతల విగ్రహాలకు వినతి పత్రాలు

విశాలాంధ్ర: తాళ్లపూడి ఏపిస్టేట్ జెఏసి పిలుపు మేరకు కార్యచరణలో భాగంగా సచివాలయ ఉద్యోగులు శనివారం విన్నూత్న రీతిలో తమ నిరసన వినతి పత్రాలను మహాత్మాగాంధీజీ, అంబేద్కర్, జగజీవన్‌రామ్, విగ్రహాలకు తాళ్లపూడి సచివాలయ ఉద్యోగులు అందచేశారు. వాలెంటీర్లు చేసే విధులు నుండి తమకు విముక్తి కలిగించాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఈ చర్యలు చేపట్టారు. తాళ్లపూడి సచివాలయ ఉద్యోగులు సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి టి.ప్రసాద్ సారథ్యం వహించారు.

ప్రతిభాంతులకు అండగా శాంతివర్ధన సేవలు

విశాలాంధ్ర - పెద్దాపురం : విభిన్న ప్రతిభాంతులైన విద్యార్థులకు అండగా శాంతివర్ధన విద్యా సంస్థల సేవలను మరింత విస్తృత్తం చేయనున్నామని పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతులు పాఠశాల డైరెక్టర్ రాయవరపు వీరబాబు, సీఈఓ రఘువీర్ అన్నారు. మండలంలోని పులిమేరు శాంతివర్ధన పాఠశాలలో అజీమ్ ప్రేమ్జీ సౌజన్యంతో శనివారం విభిన్న ప్రతిభావంతుల విద్యార్థుల తల్లిదండ్రుల నాల్గవ సమావేశం పాఠశాల ప్రిన్సిపాల్ రాయవరపు సత్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డైరెక్టర్ వీరబాబు, సీఈఓ రఘువీర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభాంతులైన విద్యార్థులకు అందించాల్సిన ప్రతీ సేవా కార్యక్రమంలో శాంతివర్ధన ముందుంటుందన్నారు. చాలా మంది విద్యార్థులు ఇదే పాఠశాలలో పురోగతి సాధించి ఇక్కడ నుంచి డిగ్రీ పట్టాతో ఉద్యోగం సాధించిన వారున్నారు. ప్రధానంగా విభిన్న ప్రతిభావంతుల తల్లిదండ్రులు ఇక్కడ నేర్చిన తర్ఫీదును సెలవుల సమయంలో ఇంటికి వచ్చినప్పుడు కొనసాగించాలన్నారు. వారి పట్ల ప్రేమాభిమానాలతో పాటు శ్రద్ధ వహిస్తే వారిలో ఉన్న లోపాన్ని దూరం చేయవచ్చన్నారు. వీరందరికి పాఠశాల తరపున ఉత్తమ సేవలందించేందుకు మున్ముందు మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ మా పిల్లల పట్ల శాంతివర్ధన యాజమాన్యం, సిబ్బంది చూపిస్తున్న ఆదరణ, ఆప్యాయత ఎనలేనిదన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు నిరామయ కార్డులు, బస్సపాస్లను వారి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డాక్యూమెంట్ ఆఫీసర్ లక్ష్మి, ఏఓ వేణు, బాబి, శాంతివర్ధన్, చైతన్య, అప్పలరాజు, సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని కారు ఢీ: మహిళ మృతి

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం మురారి గ్రామం జాతీయ రహదారిపై మోటార్ సైకిల్ పై వెళుతున్న భవానీను జగ్గంపేట వైపు నుండి రాజమండ్రి వైపు వెళుతున్న కారు ఢీకొని వెళ్లిపోవ డంతో భవాని అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాల మేరకు గండేపల్లి గ్రామానికి చెందిన బోసన కూరి రంగబాబు(40) అనే వ్యక్తి గండేపల్లి నుండి రాజమహేంద్రవరం పని నిమిత్తం వెళుతుండగా వెనక నుంచి కారు ఢీకొట్టింది. కారు ఆపకుండా వెళ్లిపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటన స్థానానికి వెళ్లిన పోలీసులు క్షతగాత్రుడుని జిఎస్ఎల్‌కు తరలించారు. ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. స్థానిక ఎస్సై శివనాగు నెంబర్‌బోర్డు ద్వారా కారుని వెంబడించడంతో ఆచూకీ లభ్యమైంది. వారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్ట్ మార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై శివ నాగబాబు తెలిపారు.

జీఎస్టీపై అవగాహన

విశాలాంధ్ర - గోపాలపురం : కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ పై నూతనంగా అమలు చేస్తున్న విధివిధానాలను గ్రామాలలో అవగాహన సదస్సులు నిర్వహించి కల్పించాలని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ శ్రీనివాస్ రావు తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఇంచార్జ్ ఎంపీడీవో ఆధ్వర్యంలో కార్యదర్శిలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు జీఎస్టీ రూపం లో ప్రతి వస్తువుపై ప్రజలపై పెను భారం పెట్టిందని ఇటీవల మోడీ ప్రభుత్వం జీఎస్టీ లో భారీగా తగ్గించిన విషయాలపై గ్రామాలలో అవగాహన సదస్సులు నిర్వహించాలని కార్యదర్శులకు ఆదేశించారు. ప్రభుత్వ పరిధిలోని శాఖల అధికారులు విధిగా గ్రామస్థాయిలో సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపీడీవో సుజాత కార్యదర్శులు పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

విశాలాంధ్ర -కొవ్వూరు : సొసైటీలో తీసుకున్న రుణాలు అన్ని సకాలంలో చెల్లించి సొసైటీ అభివృద్ధి బాటలో తీసుకు వెళ్లేందుకు సభ్యులు సహకరించాలని సొసైటీ అధ్యక్షులు చావ రామకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఆరికరేవుల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో శనివారం జరిగిన మహాజన సభ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం అధ్యక్షులు చావ రామకృష్ణ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ముందుగా రైతులకు మొక్కలు పంపిణీ చేశారు. రైతులకు సొసైటీకి వస్తున్న ఆదాయ వ్యయాలు గురించి రైతులకు తెలియజేశారు. రైతులు అడిగిన ప్రశ్నలకు సొసైటీ అధ్యక్షులు చావా రామకృష్ణ శ్రీనివాస్ వివరణ ఇచ్చారు. సొసైటీ అధ్యక్షులు మాట్లాడుతూ ప్రతి రైతు సొసైటీ అభివృద్ధికి పాటుపడాలని రైతులకు అందుబాటులో యూరియా ఉందని 2024-2025 సంవత్సరంనకు నికర లాభాన్ని సభ్యులకు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు మాకిన రామకృష్ణ, దాసరి కృష్ణ, నీటి సంఘం అధ్యక్షులు గురిజాల సురేష్ , ఆరికరేవలా ఎంపీటీసీ అల్లు వెంకటరమణ , కొవ్వూరు మండల టీడీపీ అధ్యక్షులు వట్టికూటి వెంక టేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారి గంగాధర్, సొసైటీ సెక్రెటరీ చావ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సారా రహిత జిల్లాను తీర్చిదిద్దాలి : రాహుల్‌దేవ్

విశాలాంధ్ర – ప్రత్తిపాడు : కాకినాడ జిల్లాను సారా రహితంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ అన్నారు. కాకినాడ జిల్లా ఎక్సైజ్ అధికారులకు సంబంధించిన సమీక్ష సమావేశం ప్రత్తిపాడు ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్లో శనివారం నిర్వహించారు. జిల్లాలోని తుని, పెద్దాపురం, పిఠాపురం, ప్రత్తిపాడు సర్కిల్ స్టేషన్‌లోని ఎక్సైజ్ అధికారులతో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా అధికారులు తీసుకుంటున్న చర్యలపై రాహుల్ దేవ్ శర్మ సమీక్ష నిర్వహించారు. నాటు సారా, తయారీ అమ్మకాలు చేస్తున్న గ్రామాలపై అధికారులు చేపట్టే చర్యలపై ఆరా తీశారు. ఇంత వరకు జిల్లాలో నవోదయం 2.0 కార్యక్రమాలలో జిల్లా ఎక్సైజ్ శాఖ చేపట్టిన కార్యక్రమాలపై సమగ్రంగా తెలుసుకున్నారు. రానున్న కాలంలో సారా రహిత గ్రామాలుగా ఎక్సైజ్ అధికారులు తీర్చిదిద్దే చర్యలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవోదయం 2.0 కార్యక్రమాన్ని అధికారులు బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. సారా రహితంగా మార్చేందుకు తీసుకోవలసిన విధి విధానాలను అమలు చేయాల్సిన కార్యక్రమాలపై కార్యాచరణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వై చైతన్య మురళి, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ వి రేణుక, ఎక్సైజ్ సూపరిండెంట్ కృష్ణకుమారి, ఎస్‌టిఎఫ్ ఎక్సైజ్ సూపరిండెంట్ దేవదూత్తు, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరిండెంట్లు, కే జయ మౌనిక, వి రామకృష్ణ, ప్రత్తిపాడు ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పీ శివప్రసాద్, తుని, పిఠాపురం, పెద్దాపురం ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్లు, ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ పాల్గొన్నారు.

అక్టోబర్ 3న నైపుణ్యాభివృద్ధి పై శిక్షణ

విశాలాంధ్ర – కాకినాడ : 'వికాస' ఆధ్వర్యంలో అక్టోబర్ 3 నుంచి డిడియుజికెవై సెంటర్ వాకలపూడి, కాకినాడ నందు నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతులు ప్రారంభమవుతున్నాయి. ఈ శిక్షణకు ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, డిప్లొమా ఉత్తీర్ణులైన 18 నుండి 30సం.లోపు పురుష అభ్యర్థులు అర్హులు. వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్ కోర్సుకు 3నెలలు శిక్షణ ఇచ్చి అనంతరం ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగం కల్పిస్తున్నారు. శిక్షణ అనంతరం సెంట్రల్ గవర్నమెంట్ ద్వారా సర్టిఫికెట్ ఇవ్వబడుతుంది. ఈ శిక్షణా సమయంలో ఉచిత భోజనం, వసతి, యూనిఫారమ్, స్టడీమెటీరియల్ అందించబడును. పై కోర్సులతో పాటు అదనంగా బేసిక్ కంప్యూటర్‌కోర్సు, కమ్యూనికేషన్‌స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 30లోపు 8328483297, 8978475164 ఈ నంబర్లను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవలెను.

మహిళల ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : చప్పిడి

విశాలాంధ్ర – కాకినాడ : మహిళల ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మహిళలను అన్ని విధాల ముందుకు తీసుకు వెళ్ళడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని బీసీ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాష్ట్ర శెట్టిబలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పుడు వెంకటేశ్వరరావు అన్నారు. కాకినాడ రూరల్ కొవ్వాడ గ్రామంలో స్వస్త్ నారి– సశక్త పరివారం కార్యక్రమంలో భాగంగా జరిగిన ఉచిత వైద్య శిబిరానికి అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దివ్య గైనకాలజిస్ట్, సూపర్వైజర్ ఎస్ కె ఇబ్రహీం, మరియమ్మ, ఉమాదేవి, హెల్త్ అసిస్టెంట్ ఆర్‌వి చంద్రరావు, ఆశా వర్కర్స్ మరియు ఎంఎల్‌హెచ్‌పిఎస్ తదితర వైద్య సిబ్బంది, కొవ్వాడ తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీనివాసరావు చౌదరి ఏర్పాట్లను పర్యవేక్షించారు. డాక్టర్ చప్పిడి ఐసిడిఎస్ ఆశ , అంగన్వాడీ వర్కర్స్‌ని అభినందించారు. వారు ప్రభుత్వం ఇచ్చే బాలామృతం తదితర ఫౌడర్లను ఏ విధంగా ఉపయోగించాలి, లడ్డూలు, చెకోడీలు, పకోడీలు ఇలా రకరకాలుగా తయారు చేసుకుని బలవర్ధకంగా మనం భుజించవచ్చు అనే విషయాన్ని వాళ్లు ప్రదర్శించి అవి తయారు చేసి తీసుకు వచ్చినందుకు వారిని ప్రత్యేక అభినందనలు తెలిపారు. ముఖ్యంగా స్త్రీలలో రక్తహీనత, బిపి, మధుమేహం, క్యాన్సర్ ఎలా నిర్ధారించు కోవాలో తదితర పరీక్షలు రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేశారు. రమణ రాయుడు, వెంకటేష్ సులుకుర్తి, ప్రకాష్, లక్ష్మణరావు, సిరప్ వీరభద్రరావు, రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ మట్ట ప్రకాష్, సుందరపల్లి రాఘవ, పప్పు పాపారావు, పి సత్యనారాయణ, ఉమా సతీష్, పనసయ్య, తదితరులు పాల్గొని జయప్రదం చేశారు.

ఘనంగా సాంకేతిక విద్యా ఉత్సవాలు

విశాలాంధ్ర – గొల్లప్రోలు : గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద మూడు రోజులపాటు జరిగిన సాంకేతిక విద్యా ఉత్సవాలు శనివారంతో ముగిసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పిఠాపురం నియోజకవర్గ జనసేనపార్టీ ఇన్చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులచే ప్రదర్శించబడిన పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, ప్రాజెక్ట్ ఎక్స్ పోలను ఆశక్తిగా తిలకించారు. అనంతరం ఎంపీ తంగెళ్ళ ఉదయ్ గెలుపొందిన విజేతలకు మెమెంటో, సర్టిఫికెట్లు పాటు నగదు, బహుమతులు అందజేశారు. మొట్టమొదటి ప్రాజెక్ట్‌లకు రూ.50000ల నగదు చెక్కును అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఆధునిక సమాజంలో టెక్నాలజీ రోజు రోజుకూ దూకుసుపోతుందని, దానికి తగినట్లుగా ఇంజనీరింగ్ విద్యలో మార్పులు జరుగుతున్నాయన్నారు. ఏఐ నుంచి మంచి, చెడులు ఉన్నాయని, విద్యార్థులు కేవలం మంచికి మాత్రమే వాడి జ్ఞానాన్ని సంపాదించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి, కళాశాల చైర్మన్ బుర్రా అనుబాబు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బుర్రా అనురాధ, డైరెక్టర్ బుర్రా అఖిలేష్, డిప్లొమా ప్రిన్సిపల్ డాక్టర్ వైవిఎన్ రాజశేఖర్, డీన్ డాక్టర్ ఎస్ కొండలరావు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

స్వస్త్ నారి -సశక్త్ పరివార్ అభియాన్

విశాలాంధ్ర – ఏలేశ్వరం : పట్టణంలోని అర్బన్ పిహెచ్‌సీ పరిధిలో అంబేద్కర్ నగర్ ఎస్సీ బాయ్స్ హాస్టల్ వద్ద స్వస్త్ నారి సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని అర్బన్ పిహెచ్‌సీ హెల్త్ సూపర్వైజర్ ఎస్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర పంచాయతీ చైర్పర్సన్ అలమండ సత్యవతి పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళల్లో అధికంగా క్యాన్సర్ వ్యాధి రావడం జరుగుతుందని, తొలి దశలోనే వ్యాధికి సంబంధించిన స్క్రీనింగ్ టెస్ట్‌లు వాటికి సంబంధించిన టెస్టులన్నీ చేయించుకుని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆశా వర్కర్ల క్యాన్సర్‌పై పాట, నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కౌన్సిలర్లు అలమండ చలమయ్య, బొదిరెడ్డి గోపాలకృష్ణ, మూది నారాయణస్వామి, బదిరెడ్డి గోవింద్ బాబు, శిడగం వెంకటేశ్వరరావు, సామంతుల సూర్య కుమార్, సుంకర రాంబాబు, కోనాల వెంకటరమణ, ఎండగుండి నాగబాబు, హెల్త్ సూపర్వైజర్ ఎస్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

స్వయం సమృద్ధితో పంచాయతీలు

విశాలాంధ్ర – పెదపూడి : గ్రామ పంచాయతీలకు సంబంధించి సొంత ఆదాయం సమకూరే ఇంటి పన్ను పచ్చగడ్డి, కొబ్బరి చెట్లు, చేపల చెరువుల పాటలతో పాటు శాశ్వత ఆదాయం వచ్చే చిన్న చిన్న షాపులు, షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించాలని ఇంఛార్జ్ ఎంపీడీవో మేడపాటి సత్యనారాయణ రెడ్డి సూచించారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ మీటింగ్‌హాల్లో సొంత వనరుల పెంపుదలపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు జి మామిడాడ, రామేశ్వరం పంచాయతీ కార్యదర్శులు కనక నాగేంద్ర కుమార్, భోగరాజు ప్రసన్నాంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన శిక్షణా తరగతుల్లో పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో పంచాయతీకి నిరంతర ఆదాయం వచ్చే నిర్మాణాలు చేపట్టాలని, ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్లు మీద ఆధారపడకుండా స్వయం సమృద్ధి సాధించాలన్నారు.

బకాయిలు సక్రమంగా వసూలు చేయాలి

విశాలాంధ్ర – మామిడికుదురు : వాయిదా మీరిన బకాయిలకు ఓటీఎస్ అమలు చేయాలని కోరుతూ మామిడికుదురు సొసైటీ సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేశారు. చైర్మన్ ఈలి శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం సొసైటీ కార్యాలయంలో సర్వ సభ్య సమావేశం జరిగింది. సొసైటీలో వాయిదా మీరిన బకాయిలు సుమారు రూ.మూడు కోట్లు పైబడి ఉన్నాయని సీఈఓ అడబాల పెద్దిరాజు తెలిపారు. వీటి వసూలు సక్రమంగా జరగడం లేదన్నారు. రైతు నేస్తం పథకం ద్వారా ఎకరానికి రూ.8 లక్షలు వరకు రుణం ఇచ్చేందుకు చర్యలు చేపట్టామని చైర్మన్ శ్రీనివాస్ తెలిపారు. దాత ఇచ్చిన స్థలంలో నిర్మించిన సొసైటీ భవనం పాడైపోయిందన్నారు. చుట్టూ ఉన్న ప్రహరీ దెబ్బతిందని చెప్పారు. వాటిని పునర్నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సొసైటీ ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు విక్రయిస్తామన్నారు. సొసైటీ ద్వారా రైతులకు పూర్తిగా అండగా నిలవడమే తమ లక్ష్యమని చెప్పారు. సభ్యులు కాకి శ్రీనివాస్, మట్టా సత్తిబాబు పాల్గొన్నారు.

పాదగాయక్షేత్రం ఐజీ సందర్శన

విశాలాంధ్ర – కాకినాడ : దేవి శరన్నవరాత్రుల పురస్కరించుకుని ఐజి అశోక్ కుమార్ జిల్లా ఎస్పీ బిందు మాధవ్, ఏఎస్పి దేవరాజు పాటిల్‌లతో వెళ్లి, పిఠాపురం శ్రీ పాదగయా క్షేత్రాన్ని శనివారం సందర్శించారు. ఆలయ ఈవో కాట్నం జగన్మో హన్ శ్రీనివాస్‌వారిని సాదరంగా సన్నాయి మేళంతో ఆలయ ప్రధాన అర్చకులతో ఘన స్వాగతం పలికి శేష వస్త్రాలతో సత్కరించారు. అనంతరం శక్తి పీఠం శ్రీ పురుహూతికా అమ్మవారిని, శ్రీ కుక్కుటేశ్వర స్వామివారిని, శ్రీపాద వల్లభుదుని, శ్రీ దత్తేయ స్వామివారిని ఐజి, ఎస్పీ, ఎఎస్పీ దర్శించు కొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరిం చారు. ఆలయ ఈవో పాద గయా క్షేత్ర విశిష్ట తను వారికీ వివరించారు. అర్చకులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

హౌసింగ్ కాలనీలు తనిఖీ నివేదికలు సమర్పించాలి : ఆర్డీవో

విశాలాంధ్ర – కాకినాడ : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలోని హౌసింగ్ కాలనీలను తనిఖీ చేసి నివేదికల సమర్పించాలని జిల్లా రెవెన్యూ అధికారి జె వెంకటరావు అధికారులను ఆదేశించారు. శనివారం కాకినాడ కలెక్టరేట్‌లో డీఆర్వో..డ్వామా పీడీ ఎ వెంకటలక్ష్మితో కలిసి హౌసింగ్ కాలనీల తనిఖీ పురోగతిపై పంచాయతీరాజ్, హౌసింగ్, ఆర్డబ్ల్యుఎస్ శాఖల క్షేత్రస్థాయి ఇంజినీర్లు గ్రామీణ ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. డీఆర్వో వెంకటరావు మాట్లాడుతూ.. గతంలో ఏర్పాటు చేసిన హౌసింగ్ కాలనీలకు సంబంధించి 300ల వర్క్ ఐడిలకు గాను ఇప్పటికి వరకు 189 వర్క్ ఐడిలు మాత్రమే నివేదికలు సమర్పించడం జరిగిందన్నారు. అధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టి మిగిలిన 111 వర్క్ ఐడీలను అక్టోబర్ 7 నాటికి తనిఖీ చేసి నివేదిక సమర్పిం చాలని ఆయన అధికారులను ఆదేశించారు. డ్వామా పీడీ ఎ వెంకటలక్ష్మి మాట్లాడుతూ.. పంచాయతీరాజ్, హౌసింగ్, ఆర్డబ్ల్యుఎస్ శాఖల సమన్వయంతో పనిచేసి హౌసింగ్ కాలనీల తనిఖీ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఈ పనులకు సంబంధించి జిల్లాలో వర్క్ ఐడిలు సమర్పించాల్సిన 17 మండలాలకు 12 ప్రత్యేక బృందాలను నియమించడం జరిగిందని ఆమె తెలిపారు. సమావేశంలో అన్ని డివిజన్, మండల స్థాయి పంచాయతీరాజ్, హౌసింగ్, ఆర్డబ్ల్యుఎస్ శాఖల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే శ్రీరామరక్ష

విశాలాంధ్ర – కరప : కేంద్ర ప్రభుత్వం స్వస్థ నారి స్వశక్త్ పరివార్ ఆరోగ్య కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా ప్రారంభించింది. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబానికి శ్రీరామరక్షగా ఉంటుందని డాక్టర్ వి ఏంజలీన్ తెలిపారు. కరప మండలం జెడ్ బావారం గ్రామంలో జనసేన పార్టీ నాయకులు భోగిరెడ్డి గంగాధర్, బందారు మురళి, ఉదయ శంకర్ తదితర నాయకుల ఆధ్వర్యంలో స్వస్తినారి పరివార్ నిర్వహించగా గ్రామస్తులు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. అంగన్వాడీలు ఆశ వర్కర్లు జనసేన నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రికి వైద్య పరికరాలు : ఎంపీ మహేష్

విశాలాంధ్ర - ఏలూరు : జిల్లా కేంద్రమైన ఏలూరులో గల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి గెయిల్ ఇండియా కేటాయించిన కోటి రూపాయల సీఎస్ఆర్ నిధులతో కొంత స్వాంతన చేకూరింది. ఎంపీ పుట్టా మహేష్ కుమార్ చొరవతో గెయిల్ ఇండియా కొనుగోలు చేసిన వైద్య పరికరాలు సమకూరాయి. వాటిని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభించడంతో అత్యవసర వైద్య పరికరాలు రోగులకు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వ ఆసుపత్రికి అందిన వైద్య సామగ్రిలో అనస్థీషియా వర్క్ స్టేషన్ (2), కార్డియోటోకోగ్రఫీ మెషిన్లు (2), కంప్యూటెడ్ రేడియోగ్రఫీ సిస్టమ్ (ఎక్స్‌రే క్యాసెట్ రీడర్), హెమటాలజీ అనలైజర్ (ఓపెన్ లూప్), ఆపరేషన్ థియేటర్ లైట్లు (10), ఐసిఆ లైన్డ్ రిఫ్రిజిరేటర్లు ఉన్నాయి. గతంలో ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి, సమస్యలపై ఆసుపత్రి సిబ్బందిని అడిగి తెలుసుకున్న ఎంపీ పుట్టా మహేష్ ఈ అత్యవసర వైద్య పరికరాలు లేకపోవడంతో పడుతున్న ఇబ్బందులను గమనించారు. ఎంపీ సూచనల మేరకు ఆసుపత్రి సూపరింటెండెంట్ ఈ ఏడాది మార్చిలో గెయిల్ ఇండియాకు లేఖ రాశారు. అంతటితో వదిలి పెట్ట కుండా సీఎస్ఆర్ కింద నిధులు కేటాయించి ఈ వైద్య పరికరాలు ఏర్పాటు చేయాల్సిందిగా గెయిల్ ఇండియాను ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్వయంగా కోరడంతో సానుకూలంగా స్పందించిన ఆ సంస్థ నిధులు కేటాయించడంతో వైద్య పరికరాలు ఆసుపత్రికి చేరుకోవడంతో జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటితో కలిసి ఎంపీ మహేష్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధికి తాను శాయశక్తులా కృషి చేస్తానని, భవిష్యత్తులో మరిన్ని వసతుల కల్పనకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రికి రెండు అధునాతన అంబులెన్సులు కొద్ది రోజుల్లోనే అందిస్తామన్నారు. ఆసుపత్రి అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే, కలెక్టర్, తాను కలిసికట్టుగా కృషి చేస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే బడేటి రాధా కృష్ణయ్య మాట్లాడుతూ నియోజకవర్గానికి సంబంధించి ఏ సమస్య దృష్టికి తీసుకువచ్చినా వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేసే యువ ఎంపీ ఇక్కడ ఉండటం ఏలూరు ప్రజల అదృష్టమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెట్రి సెల్వి, గెయిల్ ఇండియా జీఎం నారాయణ, హెల్త్ కేర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి శరత్, ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్

విశాలాంధ్ర - అమలాపురం : కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగానికి వ్యతిరేకంగా వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి కార్యకర్తలకు అండగా ఉండేందుకు డిజిటల్ బుక్కును ప్రారంభించారని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు అన్నారు. అమలాపురంలో మాజీమంత్రి విశ్వరూప్ నివాసంలో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, పి గన్నవరం కో ఆర్డినేటర్ గన్నవరం శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శులు చెల్లుబోయిన శ్రీనివాస రావు, పితాని బాలకృష్ణ, పాపారాయుడుతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడుతూ వైఎస్ఆర్సీపీ కార్యకర్తలను కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టి ఇబ్బందులకు గురు చేస్తుందన్నారు. కార్యకర్తలకు అండగా ఉండేందుకు డిజిటల్ బుక్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు ఉపయోగపడుతుందని నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు సంసాని బుల్లినాని, పందిరి శ్రీహరి, కొనుకు గౌతమీ, వంటెద్దు వెంకన్నయుడు, ఉండ్రు బాబ్జి, ఉండ్రు వెంకటేష్ పాల్గొన్నారు.

మెడికల్ విద్యా వ్యవస్థను దిగజారుస్తారా? : కేఎస్ బాబు

విశాలాంధ్ర - అమలాపురం : ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకారం ప్రభుత్వ వైద్య కళాశాలల్లో విద్యార్థి సాలీనా 15,000 ఫీజుతో చదువుకోవచ్చు. యాజమాన్యం కోటాలో లక్షలు కుమ్మరించ నవసరం లేదంటారా అని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కేఎస్ బాబు ప్రశ్నించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉంటే వైద్యులు, నర్సులు, బోధ నేతర సిబ్బంది కలిసి కనీసం ఒక్కో కాలేజీలో వెయ్యి మందికి ఉపాధి లభిస్తుంది. ప్రైవేట్ యాజమాన్యాలు ఈ మేరకు ఉపాధి కల్పిస్తారా అనేది ప్రశ్నార్ధకం. దీనికి పిపిపి పద్దతుల్లో వచ్చే యాజమాన్యాలు కట్టుబడి పనిచేస్తాయని భరోసా ప్రభుత్వం ఇవ్వగలదా! అంతేకాదు ఒక వైద్య కళాశాల ఏర్పాటు చేస్తే దానికి అనుబంధంగా మూడు నాలుగు వందల పడకల ఆసుపత్రి వస్తుంది. పిపిపి యాజమాన్యం పద్ధతిలో ఇది సాధ్యమా అనేది ప్రజా బాహుళ్యంలో ఉన్న పెద్ద ప్రశ్న. ప్రైవేటు ఆసుపత్రులు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం అనేక మౌలిక సదుపాయాలు కల్పిస్తుంది ఇవన్నీ చాలా చౌక ధరకే ప్రభుత్వం అందజేస్తుంది. అందుకే ప్రభుత్వ ఆసుపత్రిలో 25 నుంచి 30% మంది పేదలకు ఉచితంగా చికిత్స చేయాలి. వైద్య పరీక్షలకు అయ్యే ఖర్చు చాలా తక్కువ ఉంటుంది. ఈ నియమాలను ఎన్ని ప్రైవేటు వైద్య కళాశాలలో ఆసుపత్రులు పాటిస్తున్నాయో సీనియర్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి తెలియని విషయం కాదు. ప్రజల మనోభావాలు తెలుసుకుంటే ఆ విధమైన ఔదార్యం ఎక్కడ కనిపించట్లేదు సరి కదా! గత ప్రభుత్వం హయాంలో వైద్య కళాశాల నిర్వహణలో కొంత భారం విద్యార్థులు మోయక తప్పదు అన్నారు. దీనికోసం జగన్ హయాంలో ఒక జీవో జారీ చేశారు. ఈ మాదిరి జీఓ కూటమి ప్రభుత్వంలో కొనసాగుతుందా! రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చి ఆధునిక వైద్యం అందరికీ అందుబాటులోకి తేవాలన్నదే తమ ప్రభుత్వం లక్ష్యమని ముఖ్యమంత్రి అంటున్నారు. ఇది పిపిపి పద్ధతుల్లో ఎలా సాధ్యం వివరించటం లేదు. దాంతో ప్రజల పక్షాన నిలబడి వామపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ఉదాహరణకు ఎన్టీఆర్ సుజల స్రవంతి ఉచిత తాగునీరు పథకం ఏమైంది. తాగునీరు కొనుక్కుని తాగే పరిస్థితి నెలకొన్నది. ఆలోచన ఆచరణ ఈ రెంటిలో ఖచ్చితత్వం లేకుండా అమలు జరగవని గత అనుభవాలు తెలియజేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ పద్ధతుల్లో వైద్య కళాశాలలు నిర్మాణాన్ని పునర్ సమీక్షించాలని వామపక్షాలు ప్రజాతంత్ర శక్తులు పేద, మధ్య తరగతి ప్రజల కోరుతున్నారు. సిపిఐ రాష్ట్ర నాయకులు కేఎస్ బాబు ప్రశ్నించారు.

జీఎస్టీ తగ్గింపుపై ప్రణాళికాబద్ధంగా ప్రచారం : కలెక్టర్

విశాలాంధ్ర -భీమవరం: జీఎస్టీ తగ్గింపు ఫలాలు జిల్లాలో ప్రతి ఒక్కరికి తెలిసేలా అధికారులు ప్రణాళిక బద్దంగా విస్తృత ప్రచార కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో వాణిజ్యపన్నుల శాఖ ఆధ్వర్యంలో జీఎస్టి సంస్కరణల అమలులో భాగంగా వివిధ వ్యాపార రంగాలైన ఆటోమొబైల్స్, పౌల్ట్రీ, ఆక్వా, ట్రాన్స్పోర్ట్, కన్స్ట్రక్షన్స్, ఇన్సూరెన్స్, ఛాంబర్ ఆఫ్ కామర్స్, కిరాణా మర్చంట్ తదితర వ్యాపార సంస్థలు అసోసియేషన్స్ ప్రతినిధులు, జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వస్తుసేవల పన్ను తగ్గింపు జిఎస్టి 2.0 ప్రయోజనాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు జిల్లాలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. విద్యార్థులకు కాంపిటీషన్స్, పెయింటింగ్ పోటీలు నిర్వహించి వారికి అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఈవెంట్‌కు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సంబంధిత వెబ్సైట్లో అప్లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈనెల రోజుల ప్రచార కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియా, డిజిటల్ మీడియా ప్లాట్ ఫారంలు, హోర్డింగ్లు, ఇతర ఔట్ డోర్ ప్రచార కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని వివరించారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఏలూరు డివిజన్ వాణిజ్య పన్నుల డిప్యూటీ కమిషనర్ కె.పి.శైలజ, డిపిఒ ఎం. రామనాథరెడ్డి, డీఈఓ ఈ.నారాయణ, డిఎం అండ్ హెచ్ ఓ జి గీతాబాయి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు, పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జవ్వాది హుస్సేన్, వాణిజ్య పన్నుల శాఖ భీమవరం, తణుకు, పాలకొల్లు, తాడేపల్లిగూడెం సర్కిల్స్‌కు చెందిన జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్లు వి.కేదారేశ్వరరావు, కె.వి. శ్రీనివాసరావు, డి.సాంబ శివరావు డి.పి కిరణ్ కుమార్, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ఆదికర్మయోగి అభియాన్ గొప్పవరం :కలెక్టర్

విశాలాంధ్ర -బుట్టాయిగూడెం: బుట్టాయిగూడెం మండలం రాజానగరం ఆదిసేవా కేంద్రంలో శనివారం ఆది కర్మయోగి అభియాన్ గిరిజన గ్రామస్తులను భాగస్వామ్యం చేస్తూ ' విలేజ్ విజన్ మ్యాప్, విలేజ్ యాక్షన్ ప్లాన్ పై' ఐటిడిఏ పిఓ, ఆర్డీవో, జిల్లా, మండల వివిధ శాఖల అధికారులతో మండలాల వారీగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సమీక్షించారు. సమావేశంలో గ్రామాల్లో జనాభాకు అనుగుణంగా గ్రామాలకు కావలసిన అభివృద్ధి, విద్య, వైద్యం, గృహ నిర్మాణాలు, ఇంటి స్థలాలు, వివిధ రకాల సామాజిక పింఛన్లు, స్వచ్ఛమైన రక్షిత మంచినీటిని రెండుపూటలా పుష్కలంగా అందించేలా ఇంటింటికి కుళాయి ట్యాపు, వ్యక్తిగత మరుగు దొడ్లు, డ్రైన్లు, రహదారులు, వ్యవసాయం, హార్టికల్చర్, సెరికల్చర్, ఆక్వా, పరిశ్రమలు, తదితర పూర్తి స్థాయి నివేదికలు, తదితరుల అంశాలపై జిల్లా కలెక్టరు సుదీర్ఘంగా సమీక్షించారు. అనంతరం ఆదిసేవా కేంద్ర ఆవరణలో జిల్లా కలెక్టరు మొక్కను నాటారు. కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రారంభించిన ఆది కర్మ యోగి పథకం జిల్లాలో తొమ్మిది గిరిజన మండలాలు ఉన్నాయని తెలిపారు. గ్రామాల వారీగా క్షేత్రస్థాయిలో పరిశీలించి, అక్కడ ప్రజల సమస్యలను తెలుసుకుని వారికి అవసరమైన మౌలిక సదుపాయాలపై సవివరమైన గ్రామ విజన్ ప్రణాళికలను వెంటనే రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో ఐటిడిఏ పిఓ కె.రాములు నాయక్, ఆర్డీవో యం.వి.రమణ, ట్రైబల్ వెల్ఫేర్ డిడి యన్.శ్రీవిద్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జె. అమృతం, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ విశ్వ మోహన్ రెడ్డి, ఐసిడియస్ పిడి పి.శారద, జిల్లా పంచాయతీ రాజ్ యస్ఇ జెడ్.రమేష్, సచివాలయ, ఐటిడిఏ ఉద్యోగులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో దసరా :ఎస్పీ

విశాలాంధ్ర - అమలాపురం : దసరా పండుగను ప్రజలు భక్తి శ్రద్ధలతో ప్రశాంత వాతవరణంలో జరుపుకోవాలని, ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు కు అవకాశం ఇవ్వకుండా ప్రజలందరూ స్నేహభా వంతో పండుగను జరుపుకోవాలని అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా సూచించారు. దసరాను పురస్క రించుకుని జిల్లాలో పలుచోట్ల ఉత్సవాలు, ఊరేగింపులు జరుగనున్న నేపథ్యంలో క్లిష్టతర ప్రాంతాలలో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేసారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే లా వ్యవహరించే వారిపై చట్టపర మైన చర్యలు చేపట్టడం జరుగుతుందని హెచ్చరిం చారు. ఉత్సవాలు, ఊరేగింపులు నిర్వహించే క్రమంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ఆర్గనైజర్స్ నిర్వాహకులు భాధ్యతను వహించాలి. ఊరేగింపును తగిన సమయాలలో వారికి కేటాయించిన రూట్/ మార్గాలలో మాత్రమే నిర్వహించాలని సూచించారు. దసరా సందర్భంగా బంధువుల ఇంటికి లేదా యాత్రలకు వెళ్ళేవారు వారి ఇళ్ళల్లో విలువైన వస్తువులను ఉంచరాదని, బ్యాంకులలో భద్రపరచుకో వాలని తెలియజేసారు. ఆంధ్ర ప్రదేశ్ పోలీస్ డిపార్ట్మెంట్ వారు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం అనుసంధానం చేసి అభివృద్ధి చేసినట్లు, దీనికొరకు LHMS యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని యాప్ ద్వారా రిక్వెస్ట్ పెట్టుకున్నట్లయితే, మీ మీ పరిధిలో గల పోలీస్ స్టేషన్ నుండి పోలీసువారు మీ ఇంటికి వచ్చి కెమెరాను ఫిక్స్ చేసి నిరతరం కంట్రోల్ రూం నుండి పర్యవేక్షిస్తారని తెలియజేశారు.

'ధార్ గ్యాంగ్'తో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : సీఐ

విశాలాంధ్ర - కడియం : దోపిడీలకు దాడులకు పాల్పడే మధ్యప్రదేశ్‌కి చెందిన 'ధార్ గ్యాంగ్' తూర్పుగోదావరి జిల్లా పరిసర ప్రాంతాలలో తిరుగు తోందని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కడియం సీఐ అల్లు వెంకటేశ్వరరావు హెచ్చరించారు. కడియం మండలంలోని పలు గ్రామాలలో ఆటోల ద్వారా ప్రచారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ రాజమండ్రి, చుట్టుపక్కల పరిసర ప్రాంతాలలో రాత్రివేళల్లో ఒంటరిగా తిరగవద్దని, ముఖ్యంగా అర్ధరాత్రుల్లు ఎవరైనా తలుపు తడితే తీయవద్దని, ముందుగా వచ్చినవారు ఎవరో నిర్ధారించుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే 112 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. ముఖ్యంగా ఈ గ్యాంగ్ గ్రామాల శివారు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుందని, రాత్రి సమ యాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యక్తులు ఎవరన్నా మీ ఏరియాలలో అనుమా నాస్పదంగా తిరుగుతుంటే, వెంటనే పోలీసు వారికి తెలియజే యాలని సూచించారు. పగలు ఆటోలలో తిరుగుతూ రెక్కి నిర్వహించి, రాత్రులు నలుగురు లేక ఐదుగురు కలిసి దొంగతనాలు చేస్తున్నట్లు తెలిసిందని, అడ్డువచ్చిన కుటుంబ సభ్యులపై దాడులు చేస్తున్నారని, అపై ఇళ్లల్లో ఉన్న బంగారం, డబ్బు, ఇతర విలువైన వస్తువులు ఎత్తుకెళ్లిపోతు న్నారని తెలిపారు.

వైన్ షాప్ యజమానులకు మాస్ వార్నింగ్

విశాలాంధ్ర-పెదపూడి : వైన్ షాపుల యజమానులు దొడ్డి దారిన వ్యాపారం చేసుకుంటున్నప్పటికీ వారి జోలికి పోలేదని అయితే వారికి సంబంధం లేని విషయంలో జోక్యం చేసుకున్నారని ఇక పై అక్రమాలకు పాల్పడితే వదిలేది లేదని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి మాస్ వార్నింగ్ ఇచ్చారు. ఏయే ప్రాంతాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారో లిస్ట్ కూడా ఇవ్వడం జరిగిందని వారి పేర్లు కూడా అధికారులకు పంపడం జరుగుతుందని ఆయన అన్నారు. వైన్ షాపుల యజమానులు అనవసర ఆరోపణలు చేస్తే తగిన విధంగా బుద్ధి చెప్పడం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి హెచ్చరించారు.

ఇంద్రాణిగా భక్తులకు దర్శనమిచ్చిన మహాలక్ష్మి అమ్మవారు

విశాలాంధ్ర - పిఠాపురం : సౌందర్యానికి, శక్తికి, దయకు ప్రతీకగా, భౌతిక, ఆధ్యాత్మిక ప్రపంచ రహస్యాలను గ్రహించే అంతర్దృష్టిగలిగిన, దేవతలకు రాణియైన ఇంద్రాణిగా పిఠాపురం శ్రీ మహాలక్ష్మీ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పిఠాపురంలోని శృంగేరీ శంకరమఠానికి చెందిన శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో అమ్మవారి శరన్నవరాత్ర ఉత్సవాల్లో ఆరోరోజున అమ్మవారిని ఇంద్రాణీమాత అవతారంలో దివ్యంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకు మార్చన, విశేషపూజలు నిర్వహించారు. అలాగే ఆలయ ఉత్తరాధి కారి, వాగ్దేవీ పీఠం వ్యవస్థాపకులు ఇంద్రగంటి గోపాలకృష్ణ శర్మ పర్యవేక్షణలో పండితులు శ్రీచక్రార్చన, నవావరణార్చన, చండీ, రుద్ర హోమాలు తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించారు.

వైభవంగా బోనాల పండగ

విశాలాంధ్ర-జగ్గంపేట : దేవీ నవ రాత్రులు పురస్కరించుకుని జగ్గంపేట మండలం, మన్యంవారిపాలెం గ్రామంలో శరన్నవరాత్రులు పురస్కరించుకుని పైవీధి రామాలయం వద్ద ఉన్న దుర్గా భవాని ఆలయ ఏడవ వార్షికోత్సవ సందర్భంగా అమ్మవారికి 108 మంది కన్యలు బోనాలు సమర్పించారు. గత ఏడు సంవత్సరముల నుంచి ఈ గ్రామంలో దేవీ నవరాత్రులలో అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆచారంగా వస్తుందని భక్తులు తెలియజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు బోనాలు ఎత్తుకుని కనక దుర్గ అమ్మవారికి సమర్పించారు. మన్యవారిపాలెం గ్రామం ప్రజలంతా పాల్గొని కనుల పండగగా ఈ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్క గ్రామాల భక్తులు కూడా వచ్చి పాల్గొన్నారు.

సిరిపురం గ్రామ ఆడపడుచులు బోనాల సమర్పణ

విశాలాంధ్ర-ఏలేశ్వరం : మండలంలోని సిరిపురం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా శ్రీ శ్రీ కనకదుర్గ ఆలయ కమిటీ వారు భవానీ భక్తులు ఏర్పాటు చేసినటువంటి బోనాల పూజా కార్యక్రమంలో అత్యధికంగా భక్తులు పాల్గొన్నారు. శనివారం శ్రీ లలితా దేవి అవతారంలో ఉన్నా అమ్మవార్ని భక్తులు దర్శించుకుని కోరిన కోర్కెలు తీర్చే దేవిగా అమ్మవారిని భవాని మాల ధరించినటువంటి భక్తులతోపూజలు జరిపారు. గ్రామంలో మొట్టమొదటిసారిగా జరుగుతున్న బోనాల పండుగకు గ్రామ ప్రజలు ఆనందోత్సవాలతో పాల్గొన్నారు.

వారాహి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర - పెదపూడి: మండలంలోని గొల్లల మామిడాడ మామిడాడ శ్రీ మణి కంఠ స్వామి దేవస్థానంలో ఈనెల 30 నుండి అక్టోబర్ 2 విజయదశమి వరకు నిర్వహించబడున్న శ్రీశ్రీశ్రీ వారాహి అమ్మవారి ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవానికి అంకురార్పణగా ప్రతిష్ఠించబోయే వారాహి అమ్మవారి విగ్రహ గ్రామోత్సవం వైభవంగా ప్రారంభమైనది. రెండు రోజులపాటు గొల్లలమామిడాడ, పరిసర గ్రామాలలో అమ్మవారిని ఊరేగి ంచి సెప్టెంబర్ 30 నుండి శాస్త్రోక్తంగా అమ్మవారికి ప్రాణ ప్రతిష్ఠకు సంబంధించిన యజ్ఞ యాగాదులను నిర్వహించి అక్టోబర్ 2 విజయదశమి రోజున ఉదయం9 : 41 నిమిషాలకు ప్రాణ ప్రతిష్ట మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపారు. అమ్మ అనుగ్రహాన్ని పొంది తీర్థ ప్రసాదములు స్వీకరించాలని భక్తులందరినీ ఆహ్వానించారు.

మంచినీటి ట్యాంకు ప్రారంభం

విశాలాంధ్ర - జగ్గంపేట : జగ్గంపేటలోని శెట్టిబలిజపేట వద్ద కిల్లి రవికుమార్ జ్ఞాపకార్థం వారి కుమారుడు కిల్లి భవాని శంకర్ భాగ్యలక్ష్మి దంపతులు నిర్మించిన వాటర్ ట్యాంకును రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు ప్రారంభిం చారు. ఆయనతోపాటు మండల తెలుగు యువత అధ్యక్షుడు దేవరపల్లి మూర్తిలు వున్నారు. పంట పొలాల్లో వెలసి ఉన్న శ్రీ ధన సత్తమ్మ అమ్మవారికి వందలాది మంది మహిళలు బోనాలు సమర్పించిన కార్యక్రమంలో ఇరువురు పాల్గొన్నారు. దేవీ నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు గుడి వద్ద నిర్వహించిన భవానీలతో వున్నారు. ఆలయం వద్దకు వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యం కీర్తిశేషులు కిల్లి రవికుమార్ జ్ఞాపకార్థం వారి కుమారుడు కిల్లి భవాని శంకర్ భాగ్యలక్ష్మి దంపతులు నిర్మించారు. ఎస్వీఎస్ మాట్లాడుతూ పచ్చని పంట పొలాల మధ్య రైతులు జగ్గంపేట ప్రజలు ధన సత్తమ్మ అమ్మవారి ఆలయం కిల్లి భవాని శంకర్ వారి తండ్రి పేరిట నిర్మించారని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో ఆలయాన్ని మరింత అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు వైభోగుల కొండబాబు యాదవ్, జగ్గంపేట పంచాయతీ సెక్రెటరీ శివ, రీసు రమణ, గొర్రెల వీరబాబు, వాన శెట్టి తాతాజీ, సిమ్మ ముత్యాలు, వానశెట్టి గురయ్య, కొప్పు అర్జున్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని అంబేద్కర్ విగ్రహాలకు వినతి

విశాలాంధ్ర-గండేపల్లి : రాష్ట్ర గ్రామ వార్డ్ సచివాలయ ఎంప్లాయిస్ జేఏసీ పిలుపు మేరకు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు శనివారం మెమోరాండం అందించే కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా, జగ్గంపేటలో డా బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి గండేపల్లి, జగ్గంపేట సచివాలయ సిబ్బంది కలిసి మెమోరాండం అందించారు. కాకినాడ జిల్లా గ్రామవార్డు సచివాలయం ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి బి జాన్ క్రిస్టోఫర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ప్రతిసారీ ఇంటింటికీ తిరిగి విధులు నిర్వహించడం, క్షేత్రస్థాయిలో తీవ్ర అవమానాలకు గురికావడంతో ఉద్యోగుల ఆత్మగౌరవానికి భంగం వాటిల్లుతుందనే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఇంటింటికీ తిరిగే పనుల నుంచి విముక్తి కల్పించాలని, ఉద్యోగులను మాతృశాఖలకు అప్పగించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, అన్నివిభాగాల ప్రమోషన్స్ ఛానెల్స్ ఏర్పాటుతో పాటు జిల్లాల వారీ సీనియారిటీ జాబితా విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్హతల ఆధారంగా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విధులు అప్పగించేలా అవకాశాలు కల్పించాలని సచివాలయ సిబ్బంది కోరారు. బి జాన్ క్రిస్టోఫర్, కే ప్రసాద్, సిహెచ్ రాజేష్, ఎన్ నాగ మణి, ఎండి కరీం, గోవింద్ మరియు మండల సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పార్టీలో పనిచేసిన వారిని అనుబంధ కమిటీల్లో నియమిస్తాం

విశాలాంధ్ర-మామిడికుదురు : కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు వివరిసామని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత నీతిపూడి గణేష్ బాబు చెప్పారు. నగరం గ్రామంలో శనివారం పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. మండల శాఖ అధ్యక్షులు కొమ్ముల రాము, పరిశీలకులు మొల్లేటి త్రిమూర్తులు పర్యవేక్షణలో సమావేశం నిర్వహించారు. పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసే దిశగా పార్టీ అనుబంధ కమిటీల నియామకం చేపట్టామని గణేష్ బాబు అన్నారు. పార్టీలో కష్టపడి పని చేసే వారిని అనుబంధ కమిటీల్లో నియమిస్తామన్నారు. సమావేశంలో పార్టీ నేతలు కడలి శ్రీనివాస్, ఆగాబాకర్ హుస్సేన్, బత్తుల గంగారత్నం, వానరాశి బుజ్జి, అన్సర్ తాహిర్ హుస్సేన్, జాలెం నాగరాజు, వానరాశి వెంకటరత్నం. తవిటికి వెంకన్నబాబు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా 3 తులభారం

విశాలాంధ-దేవరపల్లి: దేవరపల్లి బాలదుర్గమ్మ ఆలయంలో శనివారం అంగరంగ వైభవంగా 3 తులభార కార్యక్రమాలు జరిగాయి. కొయ్యలగూడెం మండలం కన్నాయిగూడెం గ్రామానికి చెందిన కేశన రామాంజనే యులు యమహరి దంపతుల కుమారుడు స్వాతికకు ఇదే విధంగా కొయ్యలగూడెం మండలం ఎర్రంపేట గ్రామానికి చెందిన కోలా సుబ్బారావు భార్య వెంకటలక్ష్మికి పటిక బెల్లంతో తులాభారం నిర్వహించారు ఉండ్రాజవరం మండలం కాల్దారి గ్రామానికి చెందిన నేరి మర్ల వెంకటేశ్వం రావు సాయి గంగాభవాని కుమార్తె జాహ్నవికి బెల్లంతో తులాభారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పైడికొండల సత్యనారాయణ, కోశాధికారి కామిసెట్టి దుర్గారావు, కమిటీ సభ్యులు పైడికొండల శివయ్య భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవరపల్లికి చెందిన పుసులూరి లక్ష్మీ రూ.25 వేల విలువచేసే అమ్మవారికి బాలదుర్గమ్మ అమ్మవారికి పవలింపు సేవకు ఉయ్యాల బహుకరించారు.

జగన్‌పై నందమూరి వ్యాఖ్యలు సిగ్గుచేటు : పితాని

విశాలాంధ్ర-కాట్రేనికోన : శాసన సభలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని 'సైకో' అని నందమూరి బాలకృష్ణ వ్యాఖ్యానించడం సిగ్గుచేటని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ ధ్వజమెత్తారు. ముమ్మిడివరం పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రముఖ సినీనటుడు చిరంజీవిని అవమానించడం అంటే ఆయన అభిమానులను అవమానించడమేనని ఆయన పేర్కొన్నారు. తమ నాయకుడు జగన్ మోహన్ రెడ్డి, చిరంజీవి మధ్య జరిగిన సమావేశం చాలా ఆహ్లాదక రంగా జరిగిందని, దీనివల్ల సినిమా రంగానికి ఎంతో మేలు జరిగిం దని, నిర్మాతలు లాభపడ్డారని గుర్తు చేశారు. బాలకృష్ణ నటించిన సినిమాకు కూడా టిక్కెట్టు పెంచుకునేందుకు తమ నాయకుడు అవకాశం కల్పించారని పితాని గుర్తుచేశారు. ఈ వివాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెదవి విప్పకపోవడం మరీ ఆశ్చర్యకరంగా ఉందని ఆయన అన్నారు. తన సొంత అన్నను శాసనసభ సాక్షిగా అవమానకరమైన మాటలు మాట్లాడినా జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ స్పందించక పోవడం సిగ్గుచేటని పితాని బాలకృష్ణ అన్నారు. తమ నాయకుడు జగన్ మోహన్ రెడ్డికి నందమూరి బాలకృష్ణ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని పితాని డిమాండ్ చేశారు. ఇకపై దేవాలయం లాంటి అసెంబ్లీకి వచ్చే ఎంఎల్ఏలకు డ్రంకెన్ టెస్ట్ నిర్వహించాలని ఆయన సూచించారు.

శ్రీపీఠంలో ఆరో రోజు 100 కోట్ల కుంకుమార్చన

విశాలాంధ్ర - కాకినాడ/పిఠాపురం : కాకినాడ శ్రీ పీఠంలో జరుగుతున్న "మహాశక్తి యాగం" కార్యక్రమం శనివారం ఎంతో ఘనంగా జరిగాయి. ఆరో రోజు శ్రీపీఠంలో వేంచేసి యున్న ఐశ్వర్యాంబికా అమ్మవారిని శ్రీ రాజరాజేశ్వరి దేవిగా అలంకరించారు. మంగళ చండీ, రాజరాజేశ్వరి హోమంలను వేద పండితులు మంత్రోచ్ఛరణల నడుమ నిర్వహించారు. మహిళలు కుంకుమ పూజలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.100 కోట్ల కుంకుమార్చన కార్యక్రమం ఎంతో ఘనంగా జరుగుతోందన్నారు. 1000 కోట్ల కుంకుమార్చన లక్ష్యంగా వరుసగా మూడు సంవత్సరాల నుంచి దిగ్విజయంగా కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. ఈ మహాశక్తి యంత్రం 18 దివ్య క్షేత్రాల నుండి గర్భాలయ అంతర్భాగమైన శిలల నుండి సేకరించిన విశేషంగా తయారు చేసినదిగా అని నిర్వాహకులు తెలిపారు. సుందర చైతన్యానంద స్వామి సోదరులు పెరంబదూర్ సూరిబాబు ఈ కార్యక్రమంలో పాల్గొని మహాశక్తి యాగంపై స్పందించారు.

జీఎస్టీ సేవింగ్‌పై ప్రచారం

విశాలాంధ్ర - కరప : కేంద్ర ప్రభుత్వం వస్తువులపై తగ్గించిన సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై శనివారం కరప గ్రామంలో క్యాంపెయి నింగ్ చేయడం జరిగిందని ఎంపీడీవో సలాది వెంకట శ్రీనివాసరావు తెలిపారు. షాపుల యజమానుల వద్దకు వెళ్లి కస్టమర్లకు, షాపు యజమానులకు జీఎస్టీ స్లాబ్ రేట్లు వివరించి కిరాణా సామాన్లు నిత్యవసర వస్తువుల ధరలలో ప్రజలకు కలిగే ప్రయోజనాలు గురించి తెలియజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కరప గ్రామ పంచాయతీ కార్యదర్శి నిర్మలాదేవి పాల్గొన్నారు.